

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 07-07-2026 | సంపుటి - 29 | సంచిక -45 | రూ : 4 | పేజీలు : 8

# డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్




- శాఖలు సమన్వయం చేసుకోవాలి
- ప్రత్యేకంగా కమిటీలు వేయాలి
- టూరిజం హబ్ కింద వికారాబాద్ అభివృద్ధి : పర్యాటక సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, జూలై 6 :** వచ్చే డిసెంబర్‌లో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ కోసం కసరత్తు ప్రారంభించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు సర్కారీ శాఖల మధ్య సమన్వయం కోసం కమిటీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ ఆర్డీ బోధి పెవిలియన్ లో పర్యాటక శాఖ పై సీఎం సమీక్ష చేశారు. టూరిజం అభివృద్ధి హబ్ కింద వికారాబాద్‌కు పర్యాటక శోభ తేవాలని ముఖ్యమంత్రి సూచించారు. తారామతి బారామతిని టూరిజం ప్లేస్ గా మరింత బలోపేతం చేయాలని అన్నారు. దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని చెప్పారు. మంజీరా, దిల్ కుషా గెస్ట్ హౌస్ లను ఆధునీకరించాలని ఆదేశించారు. వికా రాబాద్ లో వీరభద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని, ఈ తరహాలో టెంపుల్ కు ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేయాలని **తరువాయి 2లో**



# సర్..పరేషాన్

- ఎన్యుమరేషన్ ఫారాలను పూరించటంలో తడబాటు
- చదువుకున్న వారికి సైతం అర్థంకాని పదజాలం
- పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న సిబ్బంది
- ప్రారంభ దశలోనే డిజిటలైజేషన్, సాంకేతిక సమస్యలు

ఖమ్మం : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) పంపిణీ చేస్తున్న ఎన్యుమరేషన్ ఫారం (గణన ఫారం) లు నింపడం ఓటర్లకు సమస్యగా మారింది. అధికార యంత్రాంగం ఫారాల **తరువాయి 2లో**

# రూ.70 వేలు లంచం..

## ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన చేర్యాల తహసీల్దార్

2లో

- సిద్దిపేట జిల్లాలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్
- చేర్యాల తహసీల్దార్ దిలీప్ నాయక్‌ను అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు



## హైదరాబాద్‌లో తొలి

# ఏరోబిన్ కంపోస్ట్ హార్వెస్ట్

2లో




- పీర్జాదిగూడ పర్వతాపూర్‌లో పైలెట్ ప్రాజెక్టు
- ఈ నెల 10న ప్రారంభించనున్న కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి
- కార్పొరేషన్ అంతటా విస్తరణకు నిర్ణయం
- 'ఎస్‌డబ్ల్యూఎం రూల్స్-2026' అమలులో 'ఎంఎంసీ' మరో మైలురాయి

# నీట్ విద్యార్థులకు అలర్ట్..

## ఫీజు రిఫండ్‌కు రేపే చివరి తేదీ!



- నీట్ యూజీ 2026 ఫీజు రిఫండ్‌పై ఎన్‌టీఏ కీలక సూచన
- బ్యాంక్ వివరాల అప్‌డేట్ కోసం రేపు రాత్రి 11:50 గంటల వరకు గడువని ప్రకటన
- ఇప్పటికే వివరాలు అందించిన వారికి రిఫండ్ ప్రక్రియ ప్రారంభమైందని వెల్లడి
- గడువు తర్వాత వివరాల మార్పునకు ఎలాంటి అవకాశం లేదని స్పష్టీకరణ
- ఇంకా లక్షలాది మంది విద్యార్థులు వివరాలు నమోదు చేయాల్సి ఉందన్న ఎన్‌టీఏ

2లో



## భారత్ చూపిన మద్దతు

# ఎప్పటికీ మరువలేం

- ఖమేనీ అంత్యక్రియలకు హాజరైన భారత ప్రతినిధి బృందం
- భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఇరాన్
- ఇరు దేశాల బంధాన్ని కొనియాడిన ఇరాన్
- భారత మద్దతు మరువబోమని వ్యాఖ్య

టెహ్రాన్/న్యూఢిల్లీ: ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు భారత ప్రతినిధి బృందం హాజరుకావడంపై ఇరాన్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా భారత్ చూపిన సంఘీభావం రెండు దేశాల మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక బంధానికి నిదర్శనమని పేర్కొంది. భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో విడుదల చేసిన ప్రకటనలో భారత ప్రభుత్వం, అధికార ప్రతినిధి బృందం, రాజకీయ నాయకులు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపింది. ఈ హాజరు పరస్పర గౌరవానికి, స్నేహానికి **తరువాయి 6లో**

# జకార్తాలో మోదీకి అరుదైన గౌరవం

## స్వయంగా వచ్చి ఆహ్వానించిన ఇండోనేషియా అధ్యక్షుడు

- ఇండోనేషియాకు చేరిన ప్రధాని
- స్వయంగా వచ్చి ఆహ్వానించిన అధ్యక్షుడు ప్రబోవో
- యుద్ధ విమానాలతో మోదీ విమానానికి ఎస్కార్ట్
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు
- ప్రంబనన్ ఆలయ సముదాయం సందర్శించనున్న మోదీ
- రక్షణ, వాణిజ్య సహకార విస్తరణపై దృష్టి



జకార్తా: మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఇండోనేషియా రాజధాని జకార్తాకు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన కోసం అక్కడి చేరుకున్న ఆయనకు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా విమానాశ్రయానికి వచ్చి స్వాగతం పలకడం విశేషం. ఇరు దేశాల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు ప్రతీకగా ఈ ప్రత్యేక ఆతిథ్యాన్ని భావిస్తున్నారు. భారత ప్రధాని ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానం ఇండోనేషియా గగనతలంలోకి ప్రవేశించిన వెంటనే ఆ దేశ వైమానిక **తరువాయి 2లో**

## దలైలామాకు శుభాకాంక్షలు

# తెలిపిన చంద్రబాబు

- నేడు దలైలామా పుట్టినరోజు

2లో



# హైదరాబాద్‌లో తొలి ఏరోబిన్ కంపోస్ట్ హార్వెస్ట్

హైదరాబాద్ : పీర్జాదిగూడలోని పర్వతాపూర్ ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్క్‌లో నగరంలోనే మొట్టమొదటి ఎరోబిన్ కంపోస్ట్ హార్వెస్ట్‌ను ఎంఎంసీ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఈ నెల 10న ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ పైలట్ ప్రాజెక్ట్‌లో అత్యాధునిక కంపోస్టింగ్ సాంకేతికత కలిగిన 'ఏరోబిన్ కంపోస్టర్'ను ఉపయోగించారు. ఇది తడి చెత్తను అత్యంత సమర్థవంతంగా సేంద్రీయ ఎరువుగా మారుస్తుంది. ఇది కరెంట్ అవసరం లేకుండా పూర్తిగా సహజమైన ఏరోబిక్ ప్రక్రియతో పని చేస్తుంది. పట్టణ ప్రాంత నివాసాలకు అనుకూలంగా ఉండేలా ఇది ఎలాంటి దుర్వాసన రాకుండా, ఈగలుదోమల బెడద లేకుండా పని చేస్తుంది. సాధారణ పద్ధతులతో పోలిస్తే ఇది చాలా వేగంగా కంపోస్ట్‌ను సిద్ధం చేస్తుంది. దీని కాంపాక్ట్ డిజైన్ కారణంగా ఇది గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లు, బల్క్ వేస్ట్ జనరేటర్లకు ఎంతో అనువైనది.

**త్వరలో కార్పొరేషన్ అంతటా విస్తరణ**

ఇటీవల కమిషనర్, అడిషనల్ కమిషనర్‌లతో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఈ ప్రాజెక్టును కార్పొరేషన్ అంతటా విస్తరించాలని నిర్ణయించారు. కార్పొరేషన్‌లోని ప్రతి సర్కిల్‌లోనూ కనీసం ఒక ప్రముఖ గేటెడ్ కమ్యూనిటీ లేదా రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ పరిధిలో ఈ ప్రాజెక్ట్‌ను విధిగా అమలు చేయనున్నారు. ఈ విస్తరణలో భాగంగా ఆగస్టు 1 నుంచి 'ఎస్ఎల్ఎంఐటీ' సంస్థ వారి 'సీఎస్ఆర్'లో భాగంగా ప్రతిష్టాత్మక 'ఎస్ఓఆర్టీ' (సెగ్రిగేషన్ ఆఫ్ వాటర్ ఫర్ రీసైక్లింగ్ అండ్ ట్రీట్‌మెంట్) ప్రాజెక్ట్ ఆర్థిక సహకారంతో, 'ఎంఏఆర్ఐ' సంస్థ, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్తంగా ఎంపిక చేసిన 15 వ్యూహాత్మక ప్రాంతాల్లో 80 ఏరోబిన్ యూనిట్లను ఏర్పాటు చేయనుంది. ఇందుకు 13 నివాస ప్రాంతాలతో పాటు ఒక విద్యా సంస్థను సైతం భాగస్వామ్యం చేయనున్నారు. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్ట్ ఉన్న పీర్జాదిగూడ కేంద్రాన్ని మోడల్ అభ్యాస, ప్రదర్శన కేంద్రంగా కొనసాగిస్తారు. విలువైన సంపదగా తడి చెత్త ఏరోబిన్ కంపోస్టర్ ద్వారా తడి చెత్త నిర్వహణ సుస్థిరంగా, విజయవంతంగా సాగడానికి 'ఎంఏఆర్ఐ' సంస్థ తరపున ప్రత్యేక ప్రాజెక్ట్ సిబ్బంది రోజువారీ పనులను, సాంకేతిక పర్యవేక్షణను చూసు కుంటారు. ఈ ప్రాజెక్ట్ అమలు చేసే ప్రాంతాల్లో తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి తడిపొడి చెత్తను వేరు చేసే అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్థానిక పారిశుధ్య కార్మికులు, హౌస్ కీపింగ్ సిబ్బందికి సాంకేతిక శిక్షణ ఇస్తారు. చెత్తను ఎక్కడికక్కడే స్థానికంగానే విభజించి, ప్రాసెస్ చేయడం ద్వారా, మున్సిపాలిటీకి రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా డంపింగ్ యార్డుల కోసం అవసరమైన భూ భారం తగ్గుతుంది. తద్వారా పల్లెల్లాగే నగరాల్లోనూ తడి చెత్తను విలువైన సంపదగా మార్చొచ్చని మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ విషయమై సోమవారం జరిగిన సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, పారిశుధ్య అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, 'ఎంఏఆర్ఐ' సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళి, ప్రాజెక్ట్ మేనేజర్ సుధా పోలేని, 'ఐటీసీ' ప్రతినిధులు ఉమాకాంత్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జకార్తాలో మోదీకి అరుదైన గౌరవం..

(మొదటిపేజీ తరువాయి)

దళానికి చెందిన యుద్ధ విమానాలు ఎస్కార్ట్ చేశాయి. జకార్తా విమానాశ్రయంలో సంప్రదాయ ఇండోనేషియా నృత్య ప్రదర్శనలతో మోదీకి ఆత్మీయ స్వాగతం లభించింది. ఈ పర్యటనలో మోదీ అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. భారత్ఇండోనేషియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం, వాణిజ్యం, రక్షణ, సముద్ర భద్రత, పెట్టుబడులు, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడంపై ఇరువురు నేతలు చర్చించనున్నారు. పర్యటనకు ముందు విడుదల చేసిన ప్రకటనలో 2018లో భారత్ ఇండోనేషియా సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా అభివృద్ధి చేశామని మోదీ గుర్తు చేశారు. ఈ భాగస్వామ్యం తర్వాత తన తొలి ద్వైపాక్షిక పర్యటన ఇదేనని పేర్కొన్నారు. అలాగే ఈ ఏడాది గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రబోవో పర్యటనకు కొనసాగింపుగానే ఈ భేటీ జరుగుతోందని తెలిపారు. ఇండోనేషియాలోని భారతీయ ప్రవాసులతో మోదీ సమావేశం కానున్నారు. అలాగే ప్రబోవోతో కలిసి యోగ్యకర్తలోని ప్రసిద్ధ ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు. ఈ ఆలయం భారత్ఇండోనేషియా సాంస్కృతిక బంధానికి ప్రతీకగా నిలుస్తుందని మోదీ పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య రక్షణ, సముద్ర భద్రత రంగాల్లో సహకారం మరింత బలపడింది. బ్రహ్మోస్ క్షిపణుల విక్రయం, ఇండో పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రత, సైనిక శిక్షణ, రక్షణ పరిశ్రమల్లో భాగస్వామ్యం విస్తరిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్ఇండోనేషియా ద్వైపాక్షిక వాణిజ్యం 24.78 బిలియన్ డాలర్లకు చేరగా, 130కి పైగా భారత కంపెనీలు ఇండోనేషియాలో పెట్టుబడులు పెట్టాయి. ఇండోనేషియా పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పర్యటించనున్నారు.

## డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్

హైదరాబాద్ : వచ్చే డిసెంబర్‌లో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ కోసం కసరత్తు ప్రారంభించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు సర్కారీ శాఖల మధ్య సమన్వయం కోసం కమిటీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ ఆర్డీ బోధి పెవిలియన్ లో పర్యాటక శాఖ పై సీఎం సమీక్ష చేశారు. టూరిజం అభివృద్ధి హబ్ కింద వికారాబాద్‌కు పర్యాటక శోభ తేవాలని ముఖ్యమంత్రి సూచించారు. తారామతి బారామతిని టూరిజం ప్లేస్ గా మరింత బలోపేతం చేయాలని అన్నారు. దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని చెప్పారు. మంజీరా, దిల్ కుషా గెస్ట్ హౌస్ లను ఆధునీకరించాలని ఆదేశించారు. వికా రాబాద్ లో వీరభద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని, ఈ తరహాలో టెంపుల్ కు ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలో ఉన్న అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజంగా మలచాలని స్పష్టం చేశారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో ఎకో పార్క్ లు తీర్చి దిద్దాలని వివరించారు. ఫ్యూచర్ సిటీ లో ఉన్న అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలని సూచించారు. అర్బన్ ఫారెస్ట్ తరహాలో సన్నాహాలు అవసరమని చెప్పారు. అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టు కోసం ప్రత్యేకాధికారిని నియమించి పనులను ముమ్మరం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పురానాపూల్ హెరిటేజ్ బ్రిడ్జిలను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా మలచాలని సూచించారు. బ్రిడ్జిలపై పర్యాటకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లను అందుబాటులోకి తేవాలన్నారు. అవకాశం ఉంటే ట్రాఫిక్‌ను మళ్లించి పర్యాటకులకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్ , టూరిజం సెక్రెటరీ వాణి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తెలంగాణ

తెలంగాణను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ దిశగా ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యాటక శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. తారామతి బారాదరిని ప్రముఖ పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాలని, దుర్గం చెరువును పూర్తిస్థాయి టూరిజం హబ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌లను ఆధునికీకరించాలని చెప్పారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలని, అక్కడి వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి యాదాద్రి తరహాలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పర్యావరణహిత పర్యాటకానికి ప్రాధాన్యమిస్తూ 'క్యూర్' పరిధిలోని అటవీ భూములను 'ఎకో టూరిజం' కింద అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో మరిన్ని ఎకో పార్కులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అర్బన్ ఫారెస్ట్ ప్రాజెక్టులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. పాతబస్తీలోని చారిత్రక పురానాపూల్ వంతెనను ప్రత్యేక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. అవసరమైతే అక్కడి ట్రాఫిక్‌ను మళ్లించి పర్యాటక జోన్‌గా మార్చాలని అధికారులకు తెలిపారు.

## నీట్ విద్యార్థులకు అలర్ట్.. ఫీజు రిఫండ్‌కు రేపే చివరి తేదీ!

నీట్ యూజీ 2026 పరీక్ష ఫీజు రిఫండ్ ప్రక్రియపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అత్యంత కీలకమైన ప్రకటన చేసింది. ఫీజు వాపసు కోసం అభ్యర్థులు తమ బ్యాంక్ ఖాతా వివరాలను ధ్రువీకరించుకోవడానికి లేదా అప్‌డేట్ చేయడానికి రేపు (జులై 7) రాత్రి 11:50 గంటలను తుది గడువుగా నిర్ణయించింది. ఈ గడువులోగా ప్రక్రియను పూర్తి చేయని అభ్యర్థులు తమ రిఫండ్‌ను కోల్పోయే ప్రమాదం ఉందని ఎన్‌టీఏ హెచ్చరించింది. ఎన్‌టీఏ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. ఇప్పటివరకు కేవలం 8,29,510 మంది అభ్యర్థులు మాత్రమే అధికారిక పోర్టల్‌లో తమ బ్యాంక్ ఖాతా వివరాలను అప్‌డేట్ చేశారు. ఇంకా పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉందని ఏజెన్సీ తెలిపింది. ఇప్పటికే వివరాలను విజయవంతంగా ధ్రువీకరించిన వారికి రిఫండ్ ప్రక్రియ మొదలైందని, గడువులోగా పూర్తి చేసిన వారిని తదుపరి దశలో పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొంది. ఈ అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని



విద్యార్థులకు సూచించింది.

**వివరాలు ఎలా అప్‌డేట్ చేయాలి?**

* అభ్యర్థులు ముందుగా అధికారిక వెబ్‌సైట్ neet.nta.nic.in ను సందర్శించాలి.
* హోమ్‌పేజీలో కనిపించే 'Final Opportunity to Confirm/Update Bank Account Details for NEET (UG) 2026 Fee Refund' అనే లింక్‌పై క్లిక్ చేయాలి.
* తమ లాగిన్ వివరాలతో సైన్ ఇన్ అయిన తర్వాత, డాష్‌బోర్డ్‌లో కనిపించే బ్యాంక్ వివరాలను జాగ్రత్తగా సరిచూసుకోవాలి.
* ఏవైనా మార్పులు అవసరమైతే వాటిని సరిదిద్ది, సబ్మిట్ చేయాలి.

ఒక్కసారి వివరాలు సమర్పించిన తర్వాత వాటినే తుదిగా పరిగణిస్తామని, గడువు ముగిశాక మార్పుల కోసం ఎలాంటి అభ్యర్థనలను అంగీకరించబోమని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. అందువల్ల విద్యార్థులు తమ బ్యాంక్ అకౌంట్ నంబర్, ఐఎఫ్‌ఎస్సీ కోడ్, ఖాతాదారుడి పేరు వంటి వివరాలను చాలా జాగ్రత్తగా, పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని సూచించింది. ప్రక్రియ పూర్తయ్యాక, కన్ఫర్మేషన్ పేజీని డౌన్‌లోడ్ చేసుకుని భవిష్యత్ అవసరాల కోసం భద్రపరచుకోవడం మంచిదని తెలిపింది.

## దలైలామాకు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు

టిబెట్‌కు చెందిన బౌద్ధ మత గురువు దలైలామా జన్మదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు అందజేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా సీఎం ఒక సందేశాన్ని పంచుకున్నారు. దలైలామా నిండు నూరేళ్లూ పూర్తి ఆరోగ్యంతో, సంతోషంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా శాంతిని స్థాపించడంలో, మానవ హక్కుల రక్షణ కోసం దలైలామా అద్వితీయమైన సేవలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి ఈ సందర్భంగా కొనియాడారు. లోకానికి దయ, అహింస, కరుణ వంటి ఉన్నతమైన విలువలను పరిచయం చేస్తూ.. దశాబ్దాలుగా కోట్లాది మందిలో దలైలామా స్ఫూర్తిని నింపుతున్నారని ప్రశంసించారు. సమాజంలో ద్వేషాన్ని వీడి, సోదరభావాన్ని పెంపొందించుకోవాలంటూ దలైలామా ఇచ్చిన సందేశాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. ఈ పరమ పూజ్య గురువు గారు ఇలాగే మరిన్ని సంవత్సరాల పాటు సమాజానికి మార్గదర్శనం చేయాలని, ఆయనకు దైవ బలం, దీర్ఘాయుష్షు లభించాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నట్టు తన సందేశంలో పేర్కొన్నారు.

## సర్..పరేషాన్...

ఖమ్మం : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) పంపిణీ చేస్తున్న ఎన్యుమరేషన్ ఫారం (గణన ఫారం)లు నింపడం ఓటర్లకు సమస్యగా మారింది. అధికార యంత్రాంగం ఫారాల పంపిణీని దాదాపు పూర్తి చేసింది. కానీ వాటిని ఎలా పూరించి ఇవ్వాలని తెలియక.. ఎలా పూరిస్తే ఏ సమస్య వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఫారంలోని సాంకేతిక పదజాలం, కాలమ్‌లు అర్థం కాక ఇబ్బంది పడుతున్నారు. నిరక్షరాస్యులే కాక అక్షరాస్యులు సైతం ఏమి చేయాలో తెలియక ఇరుగుపొరుగు వారిని ఆరా తీస్తున్నారు. అనుమానాల నివృత్తి కోసం జిల్లా కలెక్టరేట్, మున్సిపల్, ఇతర కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినా క్షేత్రస్థాయిలో మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు.

**కొందరు బీఎల్ఓల నిర్లక్ష్యం**

ఫారంపైన బీఎల్ఓ నంబర్ ఇచ్చినా..ఫోన్ చేస్తే కొందరు అందుబాటులోకి రావడం లేదు. మరికొందరి నెంబర్లు తరచూ బిజీ వస్తున్నాయి. చాలాచోట్ల బీఎల్ఓలు ఇండ్లకు తిరిగి గణన ఫారంలు ఇవ్వడం లేదు. ఒకచోట కూర్చొని ఓటర్లను అక్కడకు పిలిపించుకుంటున్నారు. ఓ వీధిలో ఒకరిద్దరికి నెంబర్లు వేసి ఇచ్చి ఆ బజార్ మొత్తానికి పంపిణీ చేయమని సూచిస్తున్నారు.

**అవగాహన లోపం**

గ్రామీణ ప్రాంతాల్లోనే కాక పట్టణాల్లోని వృద్ధులు, నిరక్షరాస్యులు ఫారం నింపడానికి ఇబ్బందులు పడుతున్నారు. బీఎల్ఓలు ఫారం ఇచ్చి వెళ్తున్నారే తప్ప ఎలా పూరించాలో సరైన అవగాహన కల్పించడం లేదనే విమర్శలు ఉన్నాయి. అక్షరాస్యులు సైతం 2002లో ఓటరు జాబితా ప్రకారం ఓటు ఉంటే ఎక్కడ, ఓటు లేకపోతే ఏమేం రాయాలో తెలియక..తెలిసిన వారినల్లా అడుగుతున్నారు. తప్పులు దొర్లితే ఓటు ఎక్కడ



తొలగిస్తారోననే భయం ఓటర్లను వేధిస్తోంది.

* **సాంకేతిక పదజాలం.. డిజిటలైజేషన్ ఇబ్బందులు**

ఎన్యుమరేషన్ ఫారంను పూరించేటప్పుడు కొన్ని సాంకేతిక పదాలు ఇబ్బంది కలిగిస్తున్నాయి. కుటుంబ సభ్యుల వివరాలు, వారి ఓటరు గుర్తింపు కార్డుల నంబర్లతో పాటు ప్రొజెనీ (సంతతి), సెల్ఫ్, నో మ్యాపింగ్ వంటి సాంకేతిక పదాలు ఎలా నింపాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. డిజిటలైజేషన్ (ఆన్‌లైన్) ప్రక్రియ ప్రారంభ దశలోనే ఉంది. రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ 4.25శాతంగా ఉందని సమాచారం. మొత్తం 85.18శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయింది. బూత్ లెవల్ ఆఫీసర్ల ద్వారా మొత్తం 14,38,446 ఫారాలు (4.25శాతం) మాత్తమే డిజిటలైజ్ చేయబడ్డాయని తెలుస్తోంది. ఖమ్మం జిల్లాలో 12,43,781 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 98.21 శాతం (12,21,533 మంది ఓటర్లకు) గణన ఫారంలు పంపిణీ చేశారు. ఇప్పటివరకు 1,47,344 ఫారంలను మాత్రమే డిజిటలైజ్ చేశారు. రాష్ట్రంలో నల్గొండ తర్వాత ఖమ్మం జిల్లా డిజిటలైజేషన్‌లో రెండో స్థానంలో ఉండటం గమనార్హం. ఫారాల సేకరణ వేగంగా జరగాలంటే ఓటర్లకు బీఎల్ఓల ద్వారా అవగాహన కల్పించాలని, తద్వారా ఇబ్బందులు తప్పి ఎస్ఐఆర్ ఆశయం నెరవేరుతుందని పలువురు సూచిస్తున్నారు.

**ఆన్‌లైన్-ఆఫ్‌లైన్ సమస్యలు**

ఆన్‌లైన్ ద్వారా ఫారం పూరించే సమయంలో ఆధార్ కార్డులోని పేరు (ఉదాహరణకు : ఇంటిపేరు ముందు వెనుక ఉండటం), ఓటర్ ఐడీలోని పేరుతో సరిగ్గా సరిపోలకపోతే ఆన్‌లైన్ సబ్మిషన్ నిలిచిపోతోంది. ఆన్‌లైన్‌లో ఎన్యుమరేషన్ ఫారం పూర్తి చేయాలంటే ఓటర్ కార్డుకు మొబైల్ నంబర్ లింక్ అయి ఉండాలి. లింక్ లేని వారు ముందుగా ఫారం 8 ద్వారా మొబైల్ నంబర్ అప్‌డేట్ చేసుకోవాల్సి వస్తోంది. 2002 నాటి ఓటర్ లిస్ట్‌లోని పార్ట్ నంబర్, సీరియల్ నంబర్ వంటి పాత వివరాలను వెతకడం ప్రస్తుత వివరాలతో వాటిని మ్యాపింగ్ చేయడం పెద్ద సమస్యగా మారింది. ఫారంలో తప్పులు దొర్లినప్పుడు ఓటర్లు వైట్‌నర్లు వాడుతున్నారు. వైట్‌నర్ ఉపయోగించిన ఫారంలు చెల్లవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఇంగ్లీష్, మిగిలిన చోట్ల తెలుగులో ఫారాలు ఇస్తున్నారు. ఉర్దూ మాత్రమే చదవగలిగే కొందరు ముస్లింలు, ఇతర భాషలు మాత్రమే చదవగలిగేవారు ఈ ఫారాలను అర్థం చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు.

## భారత్ చూపిన మద్దతు ఎప్పటికీ మరువలేం

(మొదటిపేజీ తరువాయి)

బలమైన సంకేతమని పేర్కొంది. భారత రాజకీయ నాయకులు, ఎంపీలు, మేధావులు, వివిధ మతాల ప్రతినిధులు అంత్యక్రియలకు హాజరుకావడం ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన సంబంధాలను ప్రతిబింబించిందని వెల్లడించింది. ఈ క్లిష్ట సమయంలో భారత్ చూపిన మద్దతును ఇరాన్ ప్రజలు ఎప్పటికీ మరువరని పేర్కొంది.

# వాహనదారులు సరైన పత్రాలు లేకపోతే కేసులు నమోదు, భారీ ఫైన్లు

*** జిల్లా రవాణా అధికారి శంకర్ నాయక్**

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లాలో వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు జిల్లా రవాణా అధికారి (డీటీఓ) శంకర్ నాయక్ తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా అన్ని చెల్లుబాటు అయ్యే పత్రాలను వెంట ఉంచుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ అయిన సుమారు 7 వేల ఆటోరిక్షాల యజమానులు తమ వాహనాలకు సంబంధించిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, ఇన్సూరెన్స్, పీయూసీ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. తనిఖీల సమయంలో ఈ పత్రాలు లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కమర్షియల్ వాహనాల యజమానులు త్రైమాసిక పన్నులను సకాలంలో చెల్లించాలని, పన్ను బకాయిలు ఉన్న వాహనాలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుని జరిమానాలు విధిస్తామని జిల్లా రవాణా అధికారి హెచ్చరించారు.వ్యవసాయ అవసరాల కోసం రిజిస్ట్రేషన్ పొందిన ట్రాక్టర్లను కమర్షియల్ పనులకు వినియోగించరాదని హెచ్చరించారు. కమర్షియల్ వినియోగానికి నమోదైన ట్రాక్టర్-ట్రైలర్లకు ప్రతి మూడు నెలలకు త్రైమాసిక పన్ను చెల్లించడంతో పాటు ఫిట్‌నెస్ సర్టిఫికెట్,



పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.కంప్రెసర్లు, రోటావేటర్లు అమర్చిన ట్రాక్టర్లకు కూడా త్రైమాసిక పన్ను, ఫిట్‌నెస్ సర్టిఫికెట్,ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. అలాగే స్కూల్ బస్సుల యజమానులు ప్రతి మూడు నెలలకు త్రైమాసిక పన్ను చెల్లించి, ఫిట్‌నెస్, పర్మిట్, ఇన్సూరెన్స్ పత్రాలను ఎప్పటికప్పుడు చెల్లుబాటులో ఉంచాలని సూచించారు.కొత్తగా కొనుగోలు చేసిన ప్రతి వాహనాన్ని టీఆర్ (తాత్కాలిక రిజిస్ట్రేషన్) గడువు ముగియకముందే శాశ్వత రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా రవాణా అధికారి తెలిపారు. వాహన పన్నులను సమీపంలోని మీ సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ సేవలు లేదా మొబైల్ ఫోన్ ద్వారా సకాలంలో చెల్లించుకోవచ్చని వివరించారు.

## నీటిపారుదల శాఖ ఉద్యోగుల సంఘానికి సభ్యత్వ సేకరణ



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : టిఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్, ఆదేశాల మేరకు నీటిపారుదల శాఖ సెంట్రల్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ లక్ష్మణరావు రాష్ట్ర కో కన్వీనర్ నజీర్ ఆదేశానుసారము టిఎన్జీవోస్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు జేఏసీ చైర్మన్ నాగిళ్ల మురళి, జిల్లా కార్యదర్శి జె శేఖర్ రెడ్డి సారధ్యంలో నీటిపారుదల శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మేడి జయరావు ఆధ్వర్యంలో సోమవారం నల్గొండ జిల్లా నీటిపారుదల ఉద్యోగుల సంఘానికి సభ్యత్వ నమోదు సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ ఆఫీస్ నల్లగొండ జిబి గూడెంలోని నీటిపారుదల శాఖ సర్కిల్ ఆఫీస్, క్వాలిటీ కంట్రోల్ డివిజన్ ఆఫీస్ నీటిపారుదల శాఖ విభాగం నెంబర్ 6, గుర్రంపూర్ డివిజన్ నెంబర్ 5, అంగడిపేట డివిజన్ నెంబర్ 4 ,కార్యాలయాలలో నమోదు సేకరణ జరిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వి మధుసూదనా చారి, సహా అధ్యక్షులు మహేష్ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పి ఆంజనేయులు, నల్గొండ జిల్లా టిఎన్జీవోస్ ఆఫీస్ సెక్రటరీ బి దుర్గయ్య,టింగో వైస్ ప్రెసిడెంట్ ఎండి యూనస్, టింగో వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ శ్యామ్ ప్రసాద్, తోపాటు మిగతా నీటిపారుదల శాఖ ఉద్యోగులు, పాల్గొన్నారు.

## డా" శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మానుకోట బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో డా" శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డా" శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పార్టీ జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ "దేశ సమగ్రత కోసం, జమ్మూకాశ్మీర్ పూర్తి విలీనం కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు డా" శ్యామ ప్రసాద్ ముఖర్జీ. 'ఏక్ దేశ్ మే దో విధాన్, దో నిషాన్, దో ప్రధాన్ నహీ చలేగా' అని గర్జించిన ధీశాలి.ఆయన ఆశయాలైన ఏక భారత్, సాంస్కృతిక జాతీయవాదం నేడు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కొత్త ఉత్సాహంతో ముందుకు సాగుతున్నాయి. బిజెపి కార్యకర్తలందరూ ఆయన ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవ చేయాలని కోరారు" ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సభ్యులు వద్దిరాజు రామచంద్ర రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దం అశోక్ కుమార్,జిల్లా ఉపాధ్యక్షురాలు ఓర్సు పద్మావతి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గద్దల సరోజ, జిల్లా కార్యదర్శి దారా హిందూ భారతి, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సయ్యద్ రేష్మ,రాధా పటేల్, కార్యాలయ ఇన్చార్జి పల్లె సందీప్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు క్యాజువల్ శ్యాం సుందర్ శర్మ, హుస్సేన్ నాయక్, జిల్లా, మండల, పట్టణ శాఖల నాయకులు, కార్యకర్తలు,మహిళా మోర్చా,యువ మోర్చా సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

*** ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**



జనగామ, ప్రజాస్ఫూర్తి : కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతం గా తీసుకెళ్లేందుకు కృషి చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆదేశాల మేరకు నూతనంగా నియమితులైన మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎం.పీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పని చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసి పార్టీకి మరింత బలాన్ని చేకూర్చేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తరిగొప్పుల మండల కాంగ్రెస్ అధ్యక్షులు వగల బోయిన యాదగిరి గౌడ్, నర్మెట మండల అధ్యక్షుడు రావుల బిక్షపతి, బచ్చన్న పేట మండల అధ్యక్షుడు ఎం.డి. మ సూద్, జనగామ మండల అధ్యక్షులు గూడ శ్రీధర్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు దోర్నాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొ న్నారు.

## ఈ నెల 7న జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం

*** జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు**

కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,ప్రజాస్ఫూర్తి: జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించడం జరుగుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతి శాఖల వారీగా సమీక్షించడం జరుగుతుందని, గ్రామీణ అభివృద్ధి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జల్ జీవన్ మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, గ్రామ సడక్ యోజన, వ్యవసాయం, ఉద్యానవనం, విద్య, వైద్యం ఇతర శాఖల పనితీరుపై సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

## ఏక్ పెడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో మొక్కను నాటడం)

ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: పర్యావరణ పరిరక్షణ, హరితహారం విస్తరణ, విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ మరియు జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న "ఏక్ పెడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో మొక్కను నాటడం) -జాతీయ విద్యార్థి పర్యావరణ పోటీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. "ఏక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు ప్రకృతి పట్ల ప్రేమ, బాధ్యతాభావం పెరుగుతుందని తెలిపారు. ప్రతి పాఠశాలలో కనీసం 10 పండ్ల మొక్కలు మరియు ఇతర




మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ జాతీయ స్థాయి పర్యావరణ పోటీని తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, పరిశోధకులు, సాధారణ పౌరులు మొక్కలు నాటడం, సీడ్ బాల్స్ తయారీ, పర్యావరణ అవగాహన కార్యక్రమాలలో పాల్గొని తమ ఫోటోలను అప్‌లోడ్ చేయడం ద్వారా పోటీలో పాల్గొనవచ్చని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కల నాటడం చేపట్టి "హరిత సూర్యాపేట " నిర్మాణానికి అందరూ సహకరించాలని అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్రమం లో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్, డీఇవో అశోక్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జడ్.పి. సిఇఓ శిరీష, హౌసింగ్ పిడి సిద్ధార్థ్, డిపిఓ యాదగిరి, సిపిఓ కిషన్, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఎఫ్ ఓ దామోదర్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాబూ జగ్జీవన్ రామ్ కు ఘన నివాళి

ప్రజాస్ఫూర్తి, కాప్రా : భారత మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయానికి జీవితాంతం అంకితభావంతో సేవలందించిన మహనేత బాబూ జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి సందర్భంగా కుషాయిగూడలో ఘనంగా నివాళులర్పించారు. కుషాయిగూడ అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు క్యాత దినేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్ రెడ్డి,కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి,కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్‌తో పాటు పండాల శివకుమార్ గౌడ్, నేమూరి మహేష్ గౌడ్, కొడకండ్ల యాదయ్య, పంజాల బాబు గౌడ్, సల్ల వెంకటేష్,



చిందం బాలనరసింహవంశరాజ్, చిత్తుల కిషోర్ గౌడ్, యాదగిరి, నాలచెరువుల జనార్దన్, పండాల గణేష్ గౌడ్, పిట్ల రాజు ముదిరాజ్, దయానంద్, ఆరవ సుధాకర్, గంప కృష్ణ, సారా అనిల్ ముదిరాజ్, తాళ్ల వెంకటేష్, శ్రీకాంత్ రెడ్డి, బుడంపల్లి వెంకటేష్ గౌడ్, జి. కృష్ణ కుమార్, రాంగిరివార్ నర్సింగ్ రావు, అంజన్న, అనిల్ యాదవ్, క్రాంతి, గౌతమ్ రెడ్డి, లవణం శ్రీనివాస్, కాసుల నందం, కార్తీక్, నర్సింహారెడ్డి, ధీరావత్ నాయక్, శ్రీరాములు, బాలరాజు, కృష్ణ, బ్యాంకు రాజు, నాగరాజు, కిరణ్, శ్రీనివాస్ తదితర ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, బాబూ జగ్జీవన్ రామ్ అభిమానులు పాల్గొని ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

*** జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ప్రజావాణిలో ప్రజలు సమర్పించే దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిశీలించి, పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును సానుకూల దృక్పథంతో పరిశీలించి, అర్హత ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం అర్బన్ మండలం 15వ డివిజన్‌కు చెందిన సయ్యద్ రహమత్ బీ తాను అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నానని, సొంత ఇంటి స్థలం కూడా లేదని, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ కు పంపిస్తూ, నిబంధనల మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్



ఆదేశించారు. తిరుమలాయపాలెం మండలానికి చెందిన భానురేఖ టేకులపల్లి మహిళా ప్రాంగణంలో ఏఎన్ఎం కోర్సు పూర్తి చేసినప్పటికీ, ఏఎన్ఎం సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ విషయంలో అధికారులు స్పందించడం లేదని దరఖాస్తు సమర్పించగా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి విచారించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.నేలకొండపల్లి మండలం రెవెన్యూ గ్రామానికి చెందిన లక్కం వెంకన్న, బక్కయ్య, శ్రీనివాస్ లు సర్వే నంబర్లు 993లో 23 గుంటలు, 616లో 15 గుంటలు, 1004లో 12 గుంటలు, 1005లో 12 గుంటల భూమి ఉందని, సాదా బైనామా కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ పాస్ పుస్తకాలు అందలేదని తెలపగా, సంబంధిత తహసీల్దార్‌కు పంపిస్తూ విచారించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామానికి చెందిన వంగర రమాదేవి తన కుమార్తెకు కళ్యాణలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు కాలేదని తెలపగా సంబంధిత తహసీల్దార్‌కు పంపిస్తూ అర్హత మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## ఘనంగా బాబు జగజ్జీవన్ రావు వర్ధంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : భారత మాజీ ఉప ప్రధాని స్వతంత్ర సమరయోధుడు. సామాజిక న్యాయానికి కృషిచేసిన మహానేత బాబు జగజీవన్ రావు 40వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం (టిపియుఎస్) జిల్లా అధ్యక్షుడు అప్పని శంకర్ రావు మాట్లాడుతూ బాబు జగజీవన్ రావ్ దేశ అభివృద్ధికి, సామాజిక సమానత్వానికి, అణగారిన వర్గాల సంక్షేమానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మారేపల్లి వెంకట్ మాట్లాడుతూ బాబు జగజ్జీవన్ రావ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం వైస్ ప్రెసిడెంట్ గుడిపాటి రామకృష్ణ, తెలంగాణ మొగిలి కళా సేవా సమితి అధ్యక్షులు మొగలి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : షాద్‌నగర్‌లో భారత మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 41వ వర్ధంతిని పురస్కరించుకుని తాలూకా జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. బ్లాక్ ఆఫీస్ ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ దాదాపు 40 సంవత్సరాలు పార్లమెంట్ సభ్యుడిగా, కార్మిక, రక్షణ, వ్యవసాయ శాఖల మంత్రిగా సేవలందించి దేశాభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, జేఏసీ చైర్మన్ మూలే జనార్ధన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ త్రిప్పిశెట్టి కరుణాకర్, నక్క బాల్‌రాజ్ యాదవ్, అర్జున్ కుమార్, బెన్నూరి రమేష్, మందారం నరసింహులు, మాజీ జెడ్పీటీసీ వెంకట్ రాంరెడ్డి, బాధేపల్లి సిద్ధార్థ, జాంగారి రవి, కరోల్ల సురేందర్, తుపాకుల శేఖర్ ముదిరాజు, వావిలాల సుజీవన్, జక్కుల శ్రీనివాస్, సింగపగా జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## విట్యాలలో ఘనంగా డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : జనసంఘ్ వ్యవస్థాపకులు డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఫరూఖ్ నగర్ మండలం విట్యాల గ్రామంలో పోలింగ్ బూత్ నెంబర్ 195,196 లో శక్తి కేంద్ర ఇన్చార్జి రెబ్బన మోని విష్ణు ఆధ్వర్యంలో జరిగిన జయంతి కార్యమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కక్కునూరి వెంకటేష్ గుప్తా, ఎస్సీ మోర్చ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు విట్యాల నర్సింలు పాల్గొని నివాళులు అర్పించారు. ప్రతి ఒక్క కార్యకర్త శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను గ్రామస్థాయిలోకి తీసుకెళ్లాలని, దేశ ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫరూఖ్ నగర్ మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల సురేష్, ఎస్సీ మోర్చ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎస్. శివ శంకర్, రంగంపల్లి బూత్ అధ్యక్షుడు జే.శివ, రామేశ్వరం శక్తి కేంద్ర ఇన్చార్జి వి.హనుమంత్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం: జిల్లా ఎస్పీ సంకీర్త్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా , (ప్రజా స్ఫూర్తి): ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడమే పోలీస్ శాఖ లక్ష్యమని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 16 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విన్న ఎస్పీ, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి పైరవీలు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాదివాస్ ద్వారా ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సమన్వయంతో వాటిని పరిష్కరిస్తున్నామని, ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు.

# దేశ సమైక్యత, జాతీయవాద సిద్ధాంతాల కోసం పోరాడిన మహానేత ముఖర్జీ

* బీజేపీ ముస్తాబాద్ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: దేశ సమైక్యత, జాతీయవాద సిద్ధాంతాల కోసం పోరాడిన మహానేత ముఖర్జీ అని బీజేపీ ముస్తాబాద్ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్ అన్నారు. సోమవారం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125 వ జయంతి సందర్భంగా భారతీయ జనతా ముస్తాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశ రాజకీయాల్లో జాతీయవాదానికి బలమైన పునాదులు వేసిన మహానేత డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. దేశ సమైక్యత, జాతీయవాద సిద్ధాంతాల కోసం ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. 1951 లో భారతీయ జనసంఘ్‌ను స్థాపించి దేశభక్తి భావజాలానికి రాజకీయ రూపం ఇచ్చిన గొప్ప దార్శనికుడని, ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధానులు ఉండరు అనే నినాదంతో జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తికి వ్యతిరేకంగా పోరాడి భారత సమైక్యత కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుడని కొనియాడారు. ముఖర్జీ చూపిన జాతీయవాద మార్గమే నేడు భారతీయ జనతా పార్టీకి బలమైన పునాదిగా నిలిచిందని, ఆయన ఆశయాలను ప్రతి కార్యకర్త ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు కాసోడి రమేష్, ఉప సర్పంచ్ కోలా కృష్ణా, వార్డు మెంబర్ మరుగల వేణుగోపాల్, పప్పుల శ్రీకాంత్, బూత్ అధ్యక్షులు ధీటి సత్తయ్య, చిర్రం మహేష్, పున్నం అనిల్, దొరగండ్ల చంద్రశేఖర్, యాదగిరి పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం వద్దు

* జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ప్రజావాణి దరఖాస్తులను పరిష్కారంలో అధికారుల అలసత్వాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. సోమవారం మీటింగ్ హాల్లో ప్రజావాణి దరఖాస్తులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్లో ఉంచొద్దన్నారు. శాఖల వారిగా ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పీఆర్సీ వెంటనే అమలు చేయాలి

- ఇటికాల రవీందర్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ రిపోర్టును తెప్పించుకొని వెంటనే అమలు చేయాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇటికాల రవీందర్ డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మండలంలోని వివిధ పాఠశాలలలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు బోయ రాములు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇటికాల రవీందర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు ఉన్నత విద్యకు సంబంధించిన జీవో నెంబర్ : 342అమలుకు అడ్డంకిగా ఉన్న మెమో నెంబర్ 26659ను రద్దు చేయాలని కోరారు. పదోన్నతులలో అడ్డంకిగా ఉన్న ఆడక్వసీ అనే పదాన్ని రద్దు చేయాలని, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు పదోన్నతుల కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి దుబ్బాక యాదయ్య, చౌటుప్పల మండల అధ్యక్షుడు జనపాల కిషన్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు భార్గవి, ఎస్ దుర్గయ్య, మేడి యాదయ్య, కే. మహేశ్వరి, జి.యశోద, ఈ. శ్వేత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం సప్తమ వార్షికోత్సవ వేడుకలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం తంగడపల్లి రోడ్డులోని శ్రీ పాటిమీద భక్తాంజనేయ స్వామి దేవాలయం శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం సప్తమి వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయం నిర్మాణదాత సోమవారం సత్తయ్యవెంకటమ్మ దంపతులు చేతుల మీదుగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకములు, రుద్రహోమము, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్, దేవాలయ చైర్మన్ సందగళ్ళ నాగరాజ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఉడుగు రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయాలి : సీఈఓ సుదర్శన్ రెడ్డి



జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుద ర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికా రులు, సంబంధిత అధికారులతో నిర్వ హించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐ ఆర్ కార్యక్రమం పురోగతిని సమీక్షించా రు. జిల్లా సమీకృత కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈ ఓ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రేపటి లోగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. పంపిణీ చేసిన ప్రతి ఫారాన్ని బీ ఎల్ఓలు తిరిగి సేకరించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఇళ్లకు తాళం వేసి ఉంటే 'అబ్సెంట్'గా నమోదు చేసి, అనంతరం మరోసారి సందర్శించి ఫారాలను అంద జేయాలని తెలిపారు. తప్పుడు సమా చారం అందించిన వారి పై ప్రజాప్రతిని ధుల చట్టం (RP Act) సెక్షన్31 ప్రకా రం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఎన్యుమరేషన్ ఫా రాలను బీఎల్ఓలు మాత్రమే పంపిణీ చేయాలని, రాజకీయ పార్టీల ప్రతినిధు లు లేదా బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ ఏలు) పంపిణీ చేయరాదని స్పష్టం చేశా రు. ఓటర్ల చిరునామాలను గుర్తించడం లో మాత్రమే బీఎల్ఏలు సహకరించవచ్చన్నారు. ఓటర్లకు ఫారం పూరించే వి ధానాన్ని వివరించడంలో సూపర్‌వైజర్లు బీఎల్ఓలకు సహకరించాలని, అవసర మైన చోట అనుభవం ఉన్న వాలంటీర్ల ను వినియోగించాలని సూచించారు. ప్రతి ఓటరికి ఒక్క ఎన్యుమరేషన్ ఫారమే అందజేసి, పూరించిన ఫారాన్ని మాత్రమే తిరిగి స్వీకరించాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ పనులతో పాటు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో ఎన్యుమరేషన్ ఫా రాల పంపిణీ 97 శాతం పూర్తయిందని తెలిపారు. ఇప్పటివరకు 11.38 శాతం ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందన్నా రు. సంబంధిత అధికారులతో నిర్వహిం చిన సమీక్షలో ఫారాల డిజిటలైజేషన్ ను మరింత వేగవంతం చేసి గడువులో గా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రా మాల వారీగా హెల్ప్‌డెస్క్‌లనుఏర్పాటు చేసి ఎన్యుమరేషన్ ఫారాల నింపే ప్రక్రి యను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్ట ర్ బెన్ షా లోం, ఆర్డీఓ గోపీరామ్, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో బిజెపి మండల ఇన్‌ఛార్జ్‌ల నియామకం

* జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి ; మహబూబాబాద్ జిల్లాలో బీజేపీ ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కసరత్తు ముమ్మరం చేశాయి. సోమవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్ రెండు నియోజకవర్గాలకు సంబంధించి పలువురు ముఖ్య నాయకులను మండల ఇన్‌ఛార్జ్‌లుగా నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు.

* మహబూబాబాద్ నియోజకవర్గం, మండల ఇన్‌ఛార్జ్‌లు

నెల్లికుదురు మండలం సింగారపు సతీష్, ఇనుగుర్తి మండలం పర్ని ప్రభాకర్ రెడ్డి, కేసముద్రం టౌన్ గుగులోత్ మదన్ నాయక్, కేసముద్రం రూరల్ నల్లాని పాపారావు, మానుకోట టౌన్ చిల్వూరి వెంకన్న, మానుకోట రూరల్ ధరావత్ శ్రీను, గూడూర్ మండలం పొదిల నరసింహారెడ్డి,

* డోర్నకల్ నియోజకవర్గం, మండల ఇన్‌ఛార్జ్‌లు డోర్నకల్ టౌన్

వద్దిరాజు రామచంద్రరావు, డోర్నకల్ రూరల్: గుగులోత్ రాంబాబు నాయక్, కురవి మండలం: బానోత్ ప్రభాస్ నాయక్, మరిపెడ టౌన్: నంజల అశోక్, మరిపెడ రూరల్: తాడ పూర్ణచందర్ రెడ్డి, సిరోలు మండలం: శ్రీరామోజు నాగరాజు, చిన్న గూడూర్: బోడ వెంకన్న, నరసింహులపేట: దాసరి మురళి, దంతాలపల్లి: గుగులోత్ దేవిక శంకర్ నాయక్‌లను నియమించారు. ఈ సమావేశంలో జిల్లా బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాలలు బడిలోనే ఉండాలి..పనుల్లో కాదు

* ఆపరేషన్ ముస్కాన్–XII ను పకడ్బందీగా అమలు చేయాలి: కలెక్టర్ రాహుల్ శర్మ




జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : బాలలు సమాజానికి అమూల్యమైన సంపద అని, వారు పనుల్లో కాకుండా పాఠశాలల్లోనే ఉండేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్-XII జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల కార్మికులు, తప్పిపోయిన, అనాథ, నిరాశ్రయ, భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి రక్షించడం ప్రతి శాఖ బాధ్యత అని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్‌ను సమర్థంగా అమలు చేసి అర్హులైన ప్రతి చిన్నారికి రక్షణ, విద్య, పునరావాసం కల్పించాలని అధికారులను ఆదేశించారు. బాలల హక్కుల పరిరక్షణ కేవలం మహిళా, శిశు సంక్షేమ లేదా పోలీసు శాఖల బాధ్యత మాత్రమే కాదని, రెవెన్యూ, విద్య, వైద్య, కార్మిక, పంచాయతీరాజ్ తదితర అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాలల సమస్యలపై 1098 కు సమాచారం అందిన వెంటనే స్పందించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి బాల కార్మికులు, బడికి దూరమైన పిల్లలు, భిక్షాటన చేస్తున్న చిన్నారులు, బాల్య వివాహాల బారిన పడే వారిని గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆపరేషన్ ముస్కాన్-XII పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఆర్వో వసంత కుమారి, అదనపు ఎస్పీ నరేష్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# అన్నదాతను ఆదుకోవడంలో.. ప్రభుత్వం విఫలం

* ఐతరాజు అభయేందర్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అన్నదాతను ఆదుకోవడంలో అన్ని విధాలుగా ప్రభుత్వం విఫలమైందని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఐతరాజు అభయేందర్ ఆరోపించారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తగరం సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐతరాజు అభయేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన బకాయిలు ఇప్పటికీ అనేక మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని ఆరోపించారు. దీంతో రైతులు అప్పులు తీర్చలేక, కొత్త పంట సాగుకు అవసరమైన పెట్టుబడులు సమకూర్చుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ధాన్యం బకాయిలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూరియా పంపిణీ కోసం అమలు చేస్తున్న యాప్ వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. యాప్‌లో స్లాట్‌లు సకాలంలో బుక్ కాకపోవడంతో అవసరమైన సమయంలో యూరియా అందడం లేదని, దీని ప్రభావం పంటలపై పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. యాప్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియాను అందుబాటులో ఉంచాలని కోరారు. రైతుబంధు నిధులు కూడా ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో జమ కాకపోవడం వల్ల రైతులు విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. రైతుబంధు నిధులను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిగణించి వెంటనే పరిష్కరించాలని, లేకపోతే బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కత్తుల పరమేష్, ఇంచార్జ్ బొట్ట శివ, మస్కు ఉదయ్, నితీష్, సాయి తేజ, కొలకులపల్లి వెంకట్, రాజు, నవీన్, శేఖర్, మల్లేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ రేపటితో పూర్తి చేయాలి

* సీఈవో సుదర్శన్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణలో 3.10 కోట్ల (91.85 శాతం) ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ జరిగిందని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. 'ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ' (SIR) పై కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ రేపటితో పూర్తి చేయాలన్నారు. పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫారాలు డిజిటలైజేషన్ చేయాలని ఆదేశించారు. నిర్మల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో పంపిణీ పూర్తయిందని వెల్లడించారు. అతి తక్కువగా హైదరాబాద్‌లో 71.4 శాతం, మేడ్చల్ మల్కాజిగిరిలో 73.12 శాతం పంపిణీ జరిగిందన్నారు.

# ప్రత్యేక ఓటర్ జాబితా ప్రక్రియను పరిశీలించిన

* మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా : ప్రత్యేక ఓటర్ల జాబితా (సర్) సవరణ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ కార్యక్రమం భాగంగా సోమవారం మెదక్ పట్టణం 14, 15 వ వార్డుల్లో సర్ ప్రక్రియ ను మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్ తో కౌన్సిలర్ దొంతి లక్ష్మీ ముత్యం గౌడ్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ నియమించిన బీఎల్ఓ లతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల కు అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగం ప్రకారం "ఒక వ్యక్తి కి ఒకే ఓటు" అనే నినాదంతో ఓటర్ల జాబితా లో పారదర్శకత ఉండాలని ఉద్దేశ్యంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా అన్యాయంగా తొలగించబడకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎల్వోలు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జంతువుల నుంచి వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : జంతువుల ద్వారా మనుషులకు సంక్రమించే జునోసిస్ వ్యాధుల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జంతువుల్లో ఉండే వైరస్‌లు వివిధ మార్గాల ద్వారా మనుషులకు వ్యాపించే అవకాశం ఉన్నందున వాటి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. జంతువుల్లో లేదా మనుషుల్లో వ్యాధి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి, అవి మనుషులకు వ్యాపించకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. జంతువులు అనారోగ్యానికి గురైనట్లు గుర్తిస్తే వెంటనే పశువైద్యులను సంప్రదించాలని సూచించారు. జునోసిస్ వ్యాధుల నివారణలో ముందస్తు జాగ్రత్తలు, ప్రజల్లో అవగాహన అత్యంత కీలకమని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. మధుసూదన్, డీఆర్వో వసంత కుమారి, డిప్యూటీ శిక్షణ కలెక్టర్ నవీన్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మక్కల కొనుగోళ్లలో అవినీతిపై విచారణ జరపాలి: గండ్ర




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, చిట్యాల, ప్రజాస్ఫూర్తి : మక్కల కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, రైతులకు జరిగిన నష్టాన్ని పూర్తిగా భర్తీ చేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం చిట్యాల మండల కేంద్రంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రైతులు సొంత ఖర్చులతో మక్కలను కొనుగోలు కేంద్రాలకు తరలించినా గోదాంలలో స్థలం లేదని చెప్పి పలుచోట్లకు తిప్పారని, బిల్లుల్లో అక్రమ కోతలు విధించి ఒక్కో రైతుకు సుమారు రూ.10 వేల వరకు నష్టం కలిగించారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి రైతులకు పూర్తి మొత్తాన్ని చెల్లించాలని కోరారు. ఈ ధర్నాలో చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే

* టేకుమట్ల మండలం బూర్గపల్లి మానేరు వాగులో తనిఖీ
* అధికారులను నిలదీసిన గండ్ర



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజాస్ఫూర్తి ) : టేకుమట్ల మండలం బూర్గపల్లి గ్రామంలోని మానేరు వాగులో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై ప్రజల నుంచి అందిన సమాచారం మేరకు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి సోమవారం సంఘటన స్థలాన్ని సందర్శించారు. కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ అభివృద్ధి పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా వాగు నుంచి ఇసుక తరలిస్తున్న లారీలను అడ్డుకుని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పేరుతో ఇసుకను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు కమిషన్ల కోసం అప్పగించడం దారుణమని విమర్శించారు. వాగులో ఇసుక తవ్వకాలకు ఎవరి అనుమతితో కార్యకలాపాలు జరుగుతున్నాయని తహసీల్దార్, సీఐలను ప్రశ్నించారు. అనుమతులు లేకుండా భారీ స్థాయిలో ఇసుక రవాణా జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఇసుక మాఫియా రెచ్చిపోతోందని ఆరోపించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకుని, లారీలను సీజ్ చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా సంపదను కొల్లగొట్టే అక్రమ ఇసుక దందాను బీఆర్ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమాలను పూర్తిగా అరికట్టాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

* దండి లక్ష్మి, మున్సిపల్ చైర్మన్ హుస్నాబాద్



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ పట్టణ పురపాలక సంఘం పరిధిలోని ఒకటో వార్డులో స్థానిక కౌన్సిలర్ చెన్నబోయిన అనూష విద్యాసాగర్ ఆధ్వర్యంలో శరత్ మాక్స్ విజన్ హాస్పిటల్ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం జరిగింది. ఈ శిబిరాన్ని పురపాలక సంఘం చైర్‌పర్సన్ దండి లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజలకు వారి నివాస ప్రాంతంలోనే ఉచిత కంటి వైద్య పరీక్షలు అందించడం అభినందనీయమని అన్నారు. ఆసుపత్రులకు వెళ్లలేని వారు, వైద్య ఖర్చులు భరించలేని నిరుపేదలకు ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. శిబిరాన్ని ఏర్పాటు చేసిన వార్డు కౌన్సిలర్ చెన్నబోయిన అనూషను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శరత్ మాక్స్ విజన్ హాస్పిటల్ వైద్య బృందం మాట్లాడుతూ, పట్టణంలోని అన్ని వార్డుల్లో ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని, అవసరమైన వారికి తక్కువ ఖర్చుతో కంటి ఆపరేషన్లు కూడా అందిస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కోఆప్షన్ సభ్యుడు ఎండీ హసన్, కౌన్సిలర్లు సావుల మంజుల, బత్తుల స్వరూప, బొలిశెట్టి రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రజిత గడిపి ప్రవీణ్, సింగరి, సావుల వెంకట్ సావుల మధు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలు



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా కేంద్రంలో ని బీజేపీ జిల్లా కార్యాలయంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయం తి వేడుకలను సోమవారం ఘనంగా ని ర్వహించారు.జిల్లా ఉపాధ్యక్షులు దేవర ఎల్లయ్య ఆధ్వర్యంలో నాయకులు డా క్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటాని కి పూల మాలలువేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం మొక్కలు నా టి పర్యావరణ పరిరక్షణకు తమ వం తు బాధ్యతను చాటారు. ఈ సందర్భం గా నాయకులు మాట్లాడుతూ డాక్టర్ ముఖర్జీ కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, భారత సమైక్యత, జాతీయవాదం, దేశ సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయు డని కొనియాడారు."ఒకే దేశం-ఒకే రా జ్యాంగం" అనే ఆయన దార్శనికతే నేటి భారత ఐక్యతకు బలమైన పునాది అ ని పేర్కొన్నారు. "ఏక్ దేశ్ -ఏక్ విధాన్ -ఏక్ ప్రధాన్" అనే నినాదంతో అఖండ భారత నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్ర మంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివ యాదవ్, ఉడుగుల రమేష్, జిల్లా కన్వీ నర్ పిట్టల సత్యం, జిల్లా ప్రధాన కార్య దర్శి భాగాల నవీన్ రెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవి నాయక్, ఎండో మెంట్ జిల్లా కన్వీనర్ ఈర్ల రాజు, సిటీ జనరల్ సెక్రటరీ పెద్దోజు జగదీష్, బింగి రమేష్, దూసరి శివకృష్ణ, సోమయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## డీజీపీ సీవీ ఆనంద్‌కు పచ్చని మొక్క బహూకరించిన నైనిక రజువా



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా పచ్చని మొక్కను బహూకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం హేమచంద్రపురం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నూతన పోలీస్ గెస్ట్‌హౌస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీజీపీకి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగూడెంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న నైనిక రజువా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్రకృతిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, స్పెషల్ బ్రాంచ్ సీఐ చెన్నూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రియురాలి కోసం.. జైలు గోడదూకి రిమాండ్ ఖైదీ పరార్!

మహబూబ్‌నగర్ నేరవిభాగం: మహబూబ్‌నగర్ జిల్లా జైలు నుంచి రిమాండ్ ఖైదీ పరరయ్యాడు. పోక్సో కేసులో అరెస్టయ్యి జైలులో ఉంటున్న కిశోర్ కుమార్.. క్యాంటీన్‌లో పని చేస్తూ తప్పించుకున్నాడు. ఖైదీ పరారీపై జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ ఎస్ చౌహాన్ ఆరా తీస్తున్నారు. అమరచింత మండలం నందిమల్ల గ్రామానికి చెందిన కిశోర్ కుమార్ (22) గత 25 రోజుల క్రితం ఓ పోక్సో కేసులో అరెస్టయ్యాడు. అతడి ప్రియురాలు వనపర్తి జిల్లా సఖి కేంద్రంలో ఉంది. ఆమెను కలిసేందుకు సోమవారం ఉదయం నాలుగు టవల్స్‌ను ముడి వేసుకుని గోడపై కట్టి దాని సహాయంతో గోడదూకి పారిపోయాడు. బ్యారెక్‌లో నుంచి బాత్రూమ్‌కి వెళ్తున్నాని చెప్పి పరారైనట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ ఎస్ చౌహాన్ జైలులో సూపరింటెండెంట్ శశికాంత్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వన్‌టౌన్ పోలీసులు పారిపోయిన రిమాండ్ ఖైదీ కోసం గాలిస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే అధికారుల ప్రాధాన్యత కావాలి

* జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి ప్రభుత్వం పై నమ్మకం పెంచేలా జిల్లా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. క్షేత్ర స్థాయి లో విచారణ వేగవంతం చేసి, గ్రీవెన్స్ వినతులను పెండింగ్ లో ఉంచకుండా త్వరిత గతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో అదనపు కలెక్టర్(రెవెన్యూ)బెన్ షా లొం తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు.ప్రతి ఫిర్యాదును స్వయంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు.ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి అర్జీలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించడం ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.సమస్యల పరిష్కారం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కి మొత్తం 396 వినతులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో డీఆర్డీఓ భాస్కర్, గృహ నిర్మాణ శా ఖ పీ.డీ మాతృ నాయక్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అఖిల భారత ద్విశతాధిక కవి సమ్మేళనంలో వరిపల్లి అనిల్ కుమార్‌కు ఘన సత్కారం




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : విజయవాడలోని చాంబర్ ఆఫ్ కామర్స్ ఆడిటోరియంలో ఆదివారం సవ్యసాచి గ్రూప్స్ ఆఫ్ ఇండియా, శ్రీ శ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'కృష్ణవేణి కవితోత్సవం - 169వ అఖిల భారత ద్విశతాధిక కవి సమ్మేళనం' వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ జిల్లా,నెల్లికుదురు మండలం,రాజులకొత్తపల్లి గ్రామానికి చెందిన రాష్ట్ర యువ నాయకుడు వరిపల్లి అనిల్ కుమార్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా దేశంలోని పలు రాష్ట్రాల నుంచి విచ్చేసిన ప్రముఖ కవులు,రచయితలు, సాహితీవేత్తల సమక్షంలో ఆయన మాట్లాడుతూ సమాజ హితం,సంస్కృతి పరిరక్షణలో సాహిత్యం,కవులు పోషిస్తున్న పాత్ర విశిష్టమైందని పేర్కొన్నారు.దేశ నలుమూలల నుంచి విచ్చేసిన కవులకు అభినందనలు తెలిపారు. సమాజ సేవతో పాటు సాహిత్య రంగానికి అందిస్తున్న ప్రోత్సాహాన్ని గుర్తించిన నిర్వాహకులు వరిపల్లి అనిల్ కుమార్‌ను వేదికపై శాలువాతో ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు జె. ఈశ్వరి భూషణం, సీఈఓ కత్తిమండ ప్రతాప్ కుమార్, ప్రణాళిక అధ్యక్షులు డా. పార్థసారథి, వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన ప్రముఖ కవులు,రచయితలు, సాహిత్య విశ్లేషకులు పాల్గొన్నారు.జాతీయ స్థాయి సాహిత్య వేదికపై సత్కారం అందించడం ఆనందంగా ఉందని, ఈ గౌరవానికి కారణమైన సవ్యసాచి గ్రూప్స్ ఆఫ్ ఇండియా, శ్రీ శ్రీ కళావేదిక నిర్వాహకులకు రాష్ట్ర యువ నాయకుడు వరిపల్లి అనిల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై తక్షణ చర్యలు తీసుకోవాలి

* ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్‌కు అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల వినతి



చౌటుప్పల్,ప్రజాస్ఫూర్తి: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమంలో అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. చౌటుప్పల్ మండల పరిధిలో కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘిస్తూ అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తున్నారని, ఒకే అనుమతితో బహుళ పాఠశాలలను నిర్వహిస్తున్నారని, భవన అనుమతులు లేకుండా విద్యాసంస్థలను కొనసాగిస్తున్నారని, అవసరమైన గుర్తింపులు లేకుండానే తరగతులు నిర్వహిస్తున్నారని, అధిక ఫీజులు వసూలు చేస్తూ, అక్రమాలకు పాల్పడుతున్నాయని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా చౌటుప్పల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్ణీత సమయానికి తెరుచుకోకపోవడంతో చిన్నారులు చాలా సేపు పాఠశాల బయటే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఆ పాఠశాలకు కొద్ది దూరంలోనే మండల విద్యాధికారి (ఎంఈఓ) కార్యాలయం ఉన్నప్పటికీ, ఈ ఘటనపై ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడం విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణలో ఎంఈఓ పూర్తిగా విఫలమయ్యారని, ఈ ఘటనపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు పేర్కొన్నారు. ఈ అంశాలపై గత కొంతకాలంగా ధర్నాలు, నిరసనలు, వినతిపత్రాలు, అధికారులను కలిసి ఫిర్యాదులు చేసినప్పటికీ మండల విద్యాధికారి (ఎంఈఓ), జిల్లా విద్యాధికారి (డీఈఓ) లు ఎలాంటి చర్యలు తీసుకోకుండా విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ అక్రమాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై జిల్లా స్థాయి ప్రత్యేక విచారణ కమిటీని నియమించి, అక్రమాలకు పాల్పడిన విద్యాసంస్థలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఎంఈఓ, డీఈఓలపై విచారణ జరిపించి నిర్లక్ష్యం నిర్ధారణ అయితే సస్పెండ్ చేసి శాఖాపరమైన చర్యలు చేపట్టాలని విన్నవించారు. లేనిచో అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్, దిండు భాస్కర్, నలపరాజు రమేష్, ఒంటెద్దు లింగస్వామి, వినయ్ రెడ్డి, ఊదరి రాకేష్, గంగాదేవి శివ, అత్తు, సాయి వంశీ, శైలేందర్, రామకృష్ణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘం డైరెక్టర్ గా సాయినేత ఎన్నిక



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఎలగందుల సాయి నేత అన్నారు. సోమవారం సాయి నేత సూర్యాపేట చేనేత పారిశ్రామిక సంఘం డైరెక్టర్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేటలో చేనేత సహకార సంఘం అభివృద్ధికి ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ ల సహకారంతో తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణ ప్రముఖులు సాయినేతకు అభినందనలు తెలియజేశారు.

## మున్సిపల్ అధికారులకు ప్రజా సమస్యలు పట్టవా ..?

* మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేక అవస్థ పడుతున్న పట్టణవాసులు.
* బి ఆర్ ఎస్ నియోజకవర్గ నాయకులు అయిలేని మల్లికార్జున రెడ్డి



హుస్నాబాద్,ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ దాదాపు నెల నుండి సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఇంచార్జి బాధ్యత లు తీసుకొని అక్కడ ఎక్కువ సమయం కేటాయించడం హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ బాధ్యత లో ఉండి ప్రజలకు అందుబాటులో లేకపోవడం తో ఎక్కడి ప్రజా సమస్యలు అక్కడనే నిలిచిపోతున్నవని పట్టణం లోని అభివృద్ధి పనులు నత్త నడక నడస్తున్నాయని టిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు అయిలేని మల్లికార్జున్రెడ్డి ఆరోపించారు . ప్రజలు తమ పనుల కోసం రోజుల రోజుల తరబడి మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని ప్రతి పనికి మున్సిపల్ కమిషనర్ అనుమతి ,ప్రజలు తమకున్న సమస్యలు చెప్పుకోవడానికి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని కమిషనర్ రెండు మూడు రోజులకొకసారి ఒక గంట రెండు గంటలు కార్యాలయం లో సమయం ఇస్తే ప్రజలకు సరిపోతుందా అని ప్రభుత్వన్ని ప్రశ్నించారు. అధికారులు ప్రజా సమస్యలను పట్టించుకోకపోతే ఎవరు పట్టించుకుంటారని,ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు.పట్టణ ప్రజలు ఇంత అవస్థలు పడుతున్న మున్సిపల్ అధికారులు పట్టి పట్టనట్టు ఉండడం జరుగుతుందని ఇప్పటికైనా పూర్తిస్థాయిలో కమీషనర్ హుస్నాబాద్ లోనే పని చేయాలని అధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేయాలని దృకృథం ఉండాలని లేనిచో పట్టణ ప్రజల పక్షాన ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు యాస శ్రీనివాస్ మేకల వికాస్ యాదవ్ భూక్యా రాజు నాయక్ పాల్గొన్నారు.

## సామాజిక న్యాయ పోరాట యోధుడు బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి




మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : భారత మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ దళిత నాయకుడు బాబు జగ్జీవన్‌రామ్ 40వ వర్ధంతి సందర్భంగా నేరేడ్మెట్ అంబేద్కర్ భవన్‌లో ఆయన చిత్రపటానికి నేరేడ్మెట్ ఎస్సీఆర్పీ సొసైటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు, సొసైటీ సభ్యులు మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ సామాజిక న్యాయం, సమానత్వం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన సేవలు దేశానికి ఆదర్శప్రాయమని కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యుల పగిడిపల్లి శ్రీనివాస్, గంగాధరి కృష్ణ, ఎలిమేల జ్ఞానేశ్వర్, జంగిలి శివకుమార్, మధ్యల సుధాకర్, బండ మల్లేష్, సంతోష్‌గౌడ్, విజయ్ కుమార్, యాదగిరి, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, స్థానికులు పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

# ఘనంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు

ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బీజేపీ సూర్యాపేట జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగరాజు రుక్మారావు, బీజేపీ టీచర్స్ సెల్ రాష్ట్ర కోకన్వీనర్ తీకుళ్ళ సాయిరెడ్డి,రాష్ట్ర నాయకులు బూర మల్సూర్ గౌడ్ లు మాట్లాడుతూ డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ సమగ్రత, జాతీయవాదం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని, భారతీయ జనసంఘ్‌ను స్థాపించి భారత రాజకీయాలకు జాతీయవాద సిద్ధాంతాన్ని దిశానిర్దేశం చేసిన మహోన్నత నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లమల్ల నర్సింహా,దళితమోర్చ జిల్లా అధ్యక్షులు పరుశరామ్, రవివర్మ, దాసరి వెంకన్న యాదవ్,శ్రీనివాస్ రెడ్డి,కోడి లింగయ్య, తన్నీరు వాసుదేవ్, రామచంద్రర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# ట్రాఫిక్‌ను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి

* **సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్**



సైబరాబాద్, ప్రజాస్ఫూర్తి: వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ట్రాఫిక్‌ను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్ అధ్యక్షతన ట్రాఫిక్ నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ ట్రాఫిక్‌ను మరింత సులభతరం చేయడం, ప్రజలకు అంతరాయం లేకుండా సాఫీగా రాకపోకలు సాగేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. వర్షాకాలంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో పెండింగ్ పనులను సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే రాంగ్ రూట్ ప్రయాణాలు, ప్రమాదకర డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్రీ లెఫ్ట్‌ల వద్ద వాహనాల నిలుపుదలను నివారించి ట్రాఫిక్ నిరంతరాయంగా కొనసాగేలా చూడాలని, యూటర్న్‌ల వద్ద ట్రాఫిక్ ఫ్రీ మూవ్‌మెంట్‌కు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశం అనంతరం జాయింట్ సీపీ గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, బాటిల్‌నెక్ పాయింట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి విలేజ్, రాడిసన్ జంక్షన్, ఏఎంబీ మాల్ జంక్షన్, కొత్తగూడ జంక్షన్, అంజయ్యనగర్, లేబర్ అడ్డా ప్రాంతాలను సందర్శించి ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షించారు. పరిశీలన సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీకి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బాటిల్‌నెక్ ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారాల కోసం కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కేబుల్ బ్రిడ్జి నుంచి ఐకియా ఫ్లైఓవర్ వరకు ఉన్న రెగ్యులర్ "వీఐపీ, వీవీఐపీ" మార్గాన్ని పరిశీలించి ట్రాఫిక్ ప్రవాహం, సిగ్నల్ నిర్వహణ, జంక్షన్ల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.పోలీస్ ఉన్నతాధికారులు, ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోలు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రోడ్లపై నిరంతరం అందుబాటులో ఉండాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని జాయింట్ సీపీ ఆదేశించారు. ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, ప్రజల సౌకర్యం, సురక్షిత ప్రయాణమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.ఈ సమావేశం క్షేత్రస్థాయి పరిశీలనలో ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, ట్రాఫిక్1 డీసీపీ ఎస్. రవికుమార్, అదనపు డీసీపీ ట్రాఫిక్1 జి. హనుమంతరావు, ఏడీసీపీలు, ఏసీపీలు, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలు , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రేమ పేరుతో మైనర్ బాలికపై లైంగిక దాడి

* **నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష-ఎస్పీ శ్రీనివాసరావు**



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి మెదక్ జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయస్థానం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించినట్లు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే... గత రెండు సంవత్సరాలుగా ఆటో డ్రైవర్ రజాక్ (27) పదవ తరగతి చదువుతున్న మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడుతూ, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెపై పలుమార్లు బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం మరో వివాహం చేసుకున్నప్పటికీ, ఆ విషయమై బాలిక ప్రశ్నించగా "నిన్ను కూడా పెళ్లి చేసుకుంటాను" అంటూ మభ్యపెట్టి, తన గురించి ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి చేగుంట ఎస్ఐ కె.సుభాష్ పోక్సో చట్టం ,ఇతర సంబంధిత సెక్షన్ల కింద 2020 అక్టోబర్ లో కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి తూప్రాన్ డీఎస్పీ కిరణ్ కుమార్ సమగ్ర దర్యాప్తు నిర్వహించి, నిందితుడిపై పకడ్బందీగా ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించగా, చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి, లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, భరోసా లీగల్ అడ్వైజర్ శ్వేత కేసు విచారణలో సమన్వయంతో పనిచేసి సహకారం అందించారు. కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలు, వైద్య ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను క్షుణ్ణంగా పరిశీలించిన మెదక్ జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి శ్రీమతి ఆర్.ఎం. శుభవాలి నిందితుడు రజాక్‌కు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా విధించారు. అలాగే బాధితురాలికి రూ.1,00,000 విక్టిమ్ కాంపెన్సేషన్ అందజేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మహిళలు, బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై చట్టం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి కేసును శాస్త్రీయంగా దర్యాప్తు చేసి, నేరస్థులకు కఠిన శిక్షలు పడేలా మెదక్ జిల్లా పోలీసులు కట్టుబడి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులు ఎదురైనా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని, వారికి పూర్తి రక్షణతో పాటు చట్టపరమైన సహాయం అందిస్తామని తెలిపారు.

# జర్నలిస్టుల పిల్లలకు 75 శాతం ఫీజు రాయితీ కల్పించాలి

* **టియుడబ్ల్యూజె (జేఐజేయు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలో 70 శాతం ఫీజు రాయితీ కల్పించాలని డిమాండ్ చేస్తూ టి యు డబ్ల్యూ (జే ఐ యూ ) ఆధ్వర్యంలో సోమవారం నల్గొండ పట్టణంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గార్ల పాటి కృష్ణారెడ్డి పులిమామిడి మహేందర్ రెడ్డిలు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల కారణంగా జర్నలిస్టులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఫీజులు చెల్లించలేక కొందరు విద్యార్థులు చదువును మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు.ఈ అంశంపై గతంలో జిల్లా విద్యాశాఖాధికారికి, కలెక్టరేట్ లో వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ సర్క్యులర్లు జారీ చేసిన నేపథ్యంలో, నల్లగొండ జిల్లాలో కూడా 75 శాతం ఫీజు రాయితీ అమలు చేసేలా వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు.అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు స్పందించిన అదనపు కలెక్టర్ డీఈవోసుసింధ్రరావును పిలిపించి జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ వచ్చే విధంగా చూడాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మాదారి యాదగిరి, అశ్వక్ అహ్మద్, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధరవెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మదనాచారి,ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సంఘం అధ్యక్షులు పరమేష్,వీడియో గ్రాఫర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్కే సలీం,జర్నలిస్టులు పిట్టల రామకృష్ణ, సోమ చంద్రశేఖర్, ఎండి సయ్యద్, జిల్లా యాదయ్య,పూర రమేష్,రాంప్రసాద్,గుడిపాటి శ్రీనివాస్, సందీప్,అశోక్ కుమార్, డి ,ఎస్ యాదవ్,బందేలస్వామి, బజరంగ్, ఖుద్దూస్ , ఎండి షరీఫ్ , ఎండి ఆసిఫ్, దోటి శ్రీనివాస్ చింత యాదయ్య, యాదగిరి, కొండ స్వామి ,రాంప్రసాద్, శంకర్,తరకొప్పుల శంకర్, ఎండి జుబేర్ బోగారి రామకృష్ణ,అబ్దుల్ రహీం దేవరాపల్లి మహేందర్రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా బాబు జగజ్జీవన్ రావు 40 వ వర్ధంతి



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : భారత మాజీ ఉప ప్రధాని స్వతంత్ర సమరయోధుడు. సామాజిక న్యాయానికి కృషిచేసిన మహానేత బాబు జగజీవన్ రావు 40వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం (టిపియుఎస్) జిల్లా అధ్యక్షుడు అప్పని శంకర్రావు మాట్లాడుతూ బాబు జగజీవన్ రావ్ దేశ అభివృద్ధికి, సామాజిక సమానత్వానికి, అణగారిన వర్గాల సంక్షేమానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మారేపల్లి వెంకట్ తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం వైస్ ప్రెసిడెంట్ గుడిపాటి రామకృష్ణ, తెలంగాణ మొగిలి కళా సేవా సమితి అధ్యక్షులు మొగలి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలి

: **ఎమ్మెల్యే కడియం శ్రీహరి.**



స్టేషన్ ఘనపూర్ / జనగామ, ప్రజాస్ఫూర్తి : స్టేషన్ ఘనపూర్ నియోజక వర్గ పరి ధిలోని ప్రముఖ దేవాలయాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ హనుమంత రావుతో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.గతంలో జరిగిన సమీక్ష సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలులో జాప్యం జరుగుతున్నందుకు అసంతృప్తి వ్యక్తం చేసిన కడియం శ్రీహరి, ఆలయాల అభివృద్ధికి ఆర్‌జేసీ ఆధ్వర్యంలో ప్రత్యేక అధికారుల బృందాన్ని ఏర్పాటు చేసి భక్తుల అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. ఆలయ భూములపై ఉన్న ఆక్రమణలను తొలగించి,కలెక్టర్ల ద్వారా సర్వే నిర్వహించి హద్దులు గుర్తించాలని, నెల రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జీడికల్ శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి రూ.5 కోట్ల తో, నవాబ్‌పేట శ్రీ కోదండ రామస్వామి దేవస్థానానికి రూ.3 కోట్ల తో, చిల్పూర్ బుగులు వెంకటేశ్వర స్వా మి దేవస్థానానికి రూ.10 కోట్లతో, స్టేషన్ ఘనపూర్ శ్రీ తిరుమలనాథ స్వామి దేవస్థానానికి రూ.2 కోట్లతో అభివృద్ధి మాస్టర్ ప్లాన్‌లు రూపొందించాలని సూచించారు. ఈ ప్రణాళికల్లో గర్భాలయం, ప్రాకారాలు,కల్యాణ మండపాలు, అతిథి గృహాలు, అన్నదాన సత్రాలు, టాయి లెట్లు, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్, రోడ్ల విస్తరణ, కోనేరు అభివృద్ధి, పచ్చదనం పెంపు వంటి పనులను చేర్చాలని తెలిపారు. మల్లికుదుర్ల గట్టు మల్లికార్జున స్వామి దేవస్థానంలో సీజీఎఫ్ నిధులతో మంజూరైన పనులతో పాటు భక్తుల విరాళాలతో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, ఆలయ కమిటీ చైర్మన్లు పొట్లపల్లి శ్రీధర్ రావు,నీల నర్సింహులు ,ఏలే మూర్తి,ఈఈలు,ఈఓలు, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రామాంజనేయ కాలనీలో సర్ హెల్ప్ డెస్క్ ప్రారంభం

* **గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని వినతి**
* **సర్పంచ్, ఉప సర్పంచ్**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని చుంచుపల్లి మండలంలో గల రామాంజనేయ కాలనీ గ్రామపంచాయతీ కార్యాలయం నందు గ్రామ సర్పంచ్ సరిత ఠాగూర్ , ఉప సర్పంచ్ కోడూరి నాగేష్ ఆధ్వర్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్ ఫారాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాటి నింపు విధానాన్ని తెలియపరచడం కోసం పంచాయతీ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ప్రారంభించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ల సమస్యలను పరిష్కరించడం కొరకు , వారు ఎలా పూర్తి చేయాలని ఆందోళన చెందకుండా వాటికి కావలసిన పత్రాలను ఓటర్లకు తెలియపరచడం కొరకు హెల్ప్ డెస్క్ వినియోగపడుతుందని వారు అంటూ , ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియం చేసుకోవాలని వారు కోరారు . ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నాని , గ్రామ సెక్రెటరీ రమేష్ , బి ఎల్ వో లు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలు, సైబర్ నేరాల పై జాగృతి పోలీస్ కళాబృందం అవగాహన



లింగాల ఘణపురం / జనగామ, ప్రజాస్ఫూర్తి : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో, పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఆదేశాల మేరకు సోమవారం రాత్రి లింగాల ఘనపురం పోలీస్ స్టేషన్ పరిధి లోని నెల్లుట్ల గ్రామంలో మత్తు పదార్థాలు, సైబర్ నేరాల పై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాబృందం సభ్యులు పాటలు,నాటికలు,మ్యాజిక్ షో ద్వారా యువత గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి విక్రయిస్తున్నా లేదా వినియోగిస్తున్నా వెంటనే 8712584473 మొబైల్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.విద్య ప్రాముఖ్యత,రోడ్డు ప్రమాదాల నివారణ ,బాల్య వివాహాల నిర్మూలన,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, డయల్ 100 సేవల వినియోగం,సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యం, వృద్ధ తల్లిదండ్రులను గౌరవంగా చూసుకోవడం, మూఢనమ్మకాల నిర్మూలన వంటి సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాలు, బెట్టింగ్ యాప్‌ల మోసాల పై ప్రత్యేక నాటిక ప్రదర్శించి, సైబర్ మో సాలకు గురైతే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూ చించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ శ్రావణ్ కుమార్, గ్రామ సర్పంచ్ నార్సింగ రామకృష్ణ, హెడ్ కానిస్టేబుళ్లు బాబు, నాగరాజు, కానిస్టేబుళ్లు దేవ్ సింగ్, నరేష్, రాజు, హోంగార్డులు, జాగృతి పోలీస్ కళాబృందం సభ్యులు, ఇతర పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఘనంగా... బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : జగ్జీవన్ రామ్అంబేద్కర్ భవన అభివృద్ధి కమిటీ , అంబేద్కర యువజన సంఘం,మాదిగ జె ఏ సి ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. నల్గొండ పట్టణంలోని నాగార్జున డిగ్రీ కళాశాల దగ్గర గల బాబు జగ్జీవన్ రామ్ విగ్రహనికి, మాస్ రాష్ట్ర అధ్యక్షులు పెరిక కరణ్ జయ రాజ్ , మాస్ జిల్లా అధ్యక్షులు కత్తుల జగన్ కుమార్ , మాస్ గౌరవ అధ్యక్షులు కత్తుల షణ్ముఖ కుమార్ ఉపాధ్యక్షులు పెరిక ఉమా మహేశ్వర్ ల తో పాటు దళిత సంఘాల నాయకులు , ప్రజా ప్రతి నిధులు , మేధావులు , అధికారులు , న్యాయ వాదులు , ఉద్యోగులు , ఉపాధ్యాయులు , విద్యార్థి సంఘ నాయకులు, యువజన సంఘ నాయకులు పాల్గొని ఆ మహనీయునికి పూల మాలలతో నివాళులు అర్పించారు, కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అడిషనల్ ఎస్పీ రమేష్, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అధికారి శశికళ , అంబేద్కర్ జగ్జీవన్ రామ్ భవన అభివృద్ధి కమిటీ చైర్మన్ బొర్రా సుధాకర్ , మాస్ రాష్ట్ర అధ్యక్షులు పెరిక కరణ్ జయరాజ్ గౌరవ అధ్యక్షులు కత్తుల షణ్ముఖ కుమార్ , పెరిక రమేష్ జిల్లా అధ్యక్షులు కత్తుల జగన్ కుమార్ , ఉపాధ్యక్షులు పెరిక ఉమామహేశ్వర్ మాస్ ప్రధాన కార్యదర్శి కందుల లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు కొప్పోలు అశోక్ , వట్టపు శ్రవణ్, చింత శివరామకృష్ణ , జడ్ పి టి సి మాజీ కో ఆప్షన్ సభ్యులు తీగల జాన్ శాస్త్రీ, మైనం విక్రమ్ దళిత సంఘాల ఐ కా స రాష్ట్ర ఉపాధ్యక్షులు పడిదల నవీన్ కుమార్, పట్టణ కార్పొరేటర్లు పెరిక యాదయ్య బొజ్జ శంకరయ్య స్వాతి రాజశేఖర్ దీప్లా నాయక్ పట్టణ మాస్ అధ్యక్షులు ఇరిగి ప్రసాద్ ప్రధాన కార్యదర్శి కత్తుల సన్నీ ఉపాధ్యక్షులు పెరిక హరి ప్రసాద్ చిట్టి పెరిక అంజయ్య , పేర్ల నరేందర్, పగడాల శివ, బొజ్జ సైదులు, బొజ్జ పాండు కుడుతల నాగరాజు, మాతంగి లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# 3వ రాష్ట్ర మహాసభల జయప్రదం చేయాలి



ప్రజాస్ఫూర్తి, పాలేరు: కూసుమంచి మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య 3వ రాష్ట్ర మహాసభల జయప్రదం చేయాలని కోరుతూ మహాసభల కరపత్రాలను విడుదల చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి నాయక్‌మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో ఈనెల 18,19 తారీకున జరిగే మహాసభను జయప్రదం చేయాలని అధిక సంఖ్యలో గిరిజనులు హాజరుకావాలని ఆయన పిలుపు నివ్వడం జరిగింది తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది గిరిజనులు ఉన్నారని వారి హక్కుల కోసం మరియు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వి ఫలమైందని గిరిజలంతా ఏకమై ఉద్యమించాలని వారు పిలుపునివ్వడం జరిగింది. ఖమ్మం జిల్లా అధ్యక్షులు బానోత్ రాంబాబు మాట్లాడుతూ కూసుమంచి మండల లో ఎక్కువ శాతం గిరిజనులు ఉన్నారు కావున మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మా ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నాము ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు బానోత్ భారత్ జిల్లా కార్యదర్శి బానోత్ జగన్ సిపిఐ మండల కార్యదర్శి భూక్యా నరసింహ గిరిజన సమాఖ్య మండల అధ్యక్షులు భూక్యా వీరన్న సహాయం కార్యదర్శి భూక్యా శ్రీకాంత్ భూక్యా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యానగర్ లో శ్రీనివాస ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ప్రారంభం

* **సర్పంచ్ , ఉప సర్పంచ్**



ప్రజాస్ఫూర్తి , చుంచుపల్లి : మండల పరిధిలోని విద్యానగర్ కాలనీ గ్రామం సాయిబాబా గుడి దగ్గర ప్రముఖ ఆర్‌ఎంపీ వైద్యులు , విద్యానగర్ కాలనీ గ్రామ సుపరిచితులు రమణ చారి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీనివాస ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ను విద్యానగర్ కాలనీ సర్పంచ్ భూక్య శాంతి శ్రీ , ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యులు దేవునితో సమానం అని , వైద్య వృత్తి చాలా పవిత్రమైనదని వారు అంటూ , అనతి కాలంలోనే అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు . ఈ కార్యక్రమంలో విద్యానగర్ కాలనీ లో గల వివిధ వార్డ్ మెంబర్స్ తో పాటు , మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్ సింగ్ నాయక్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి , గ్రామ పెద్దలు , శ్రేయోభిలాషులు పాల్గొన్నారు .

# గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

* ఆపరేషన్ ముస్కాన్‌ను విజయవంతం చేయాలి.జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని అధికారులు అత్యంత బాధ్యతగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్, తో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి,చట్ట నిబంధనల ప్రకారం అర్హులకు తక్షణమే న్యాయం చేయాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు,విద్యుత్ సరఫరా,మరుగుదొడ్ల నిర్వహణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా పాఠశాల ఆవరణలను శుభ్రంగా ఉంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజలు ప్రధానంగా భూ సమస్యలు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు,ఆసరా పింఛన్లు, ఉపాధి హామీ పథకం , స్థానిక మున్సిపాలిటీ, పంచాయతీ సమస్యలపై కలెక్టర్కు వినతి పత్రాలు సమర్పించారు. గార్ల మండలం, సీతంపేట గ్రామానికి చెందిన బి.లాలి తాము నిరుపేదలమని,కూలి పనిచేసి జీవనం సాగిస్తున్నామని, తాము ఇందిరమ్మ జాబితాలో ఎల్.1 లో ఉన్నామని, తమకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. కె.జి.బి.వి, మహబూబాబాద్ లో కుక్ గా పనిచేసిన ఎస్.కె షాహీన్ తనకు 2022 వ సంవత్సరం నుండి జీతం రావట్లేదని తన కుటుంబ ఆర్థిక స్థితిని దృష్టిలో పెట్టుకుని తనకు తాను ఇప్పటివరకు కుక్ గా పనిచేసిన జీతాన్ని ఇప్పించగలరని కోరారు.గూడూరు మండలం, ఎపూరు గ్రామానికి చెందిన ఈరబోయిన వెంకన్న గ్రామంలోని పాటశాల ఆవరణలో ఉన్న చేతిపంపును పూడ్చివేసి అట్టి స్థలంలో ఇంటినిర్మానం చేశారని అట్టి నిర్మాణాన్ని తొలగించి చేతి పంపును వాడుకలోకి తీసుకురావాలని, అట్టి అక్రమ నిర్మాణం చేపట్టిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్ట రేట్‌లో శుక్రవారం ఆపరేషన్ ముస్కాన్ 12పై వివిధ శాఖల అధికారుల తో కలిసి ఆపరేషన్ ముస్కాన్ 12 పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, డి.ఆర్,ఓ నాగలక్ష్మి, ఇంచార్జ్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి శిరీష, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నాగమణి, సామాజిక వేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్,అధికారులు పాల్గొన్నారు.

## టేకుమట్లలో అక్రమ ఇసుక రవాణా.. అధికారులపై చర్యలు తీసుకోవాలి

: సీపీఐ(ఎంఎల్)



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, టేకుమట్ల, ప్రజాస్ఫూర్తి : మండలంలోని కలికోట గ్రామపంచాయతీ పరిధిలోని మానేరు వాగు, అలాగే వెలిశాల, బూర్నపల్లి, ఆసిరెడ్డిపల్లి, రాఘవరెడ్డిపేట గ్రామాల సమీపంలోని చలివాగు నుంచి నిబంధనలకు విరుద్ధంగా టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సీపీఐ(ఎంఎల్) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండానే కొంతకాలంగా ఇసుక దందా కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. ఇందిరమ్మ గృహాల పేరుతో ఇసుకను పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి పేరుతో కూడా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా మండల అధికారులు స్పందించడం లేదన్నారు. అక్రమ ఇసుక రవాణా రాత్రి వేళల్లో కూడా యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ స్పందించి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు, అక్రమ ఇసుక రవాణాను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన కోరారు.సహజ సంపదను విచ్చలవిడిగా దోచుకుంటున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం విచారకరమని, వెంటనే చర్యలు చేపట్టాలని మారేపల్లి మల్లేష్ డిమాండ్ చేశారు.

## ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

– కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం స్పెషల్ ఇంటెన్సివ్ కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓ సదయ్య, సూపర్‌వైజర్ జితేందర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌కు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. అనంతరం పోలింగ్ కేంద్రం నంబర్ 79లో కలెక్టర్ తన ఓటు హక్కును నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల నమోదు, మార్పులు-చేర్పులకు సంబంధించి సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాలను ఆన్‌లైన్‌లో త్వరితగతిన నమోదు చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు.బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు, మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు తదితర వివరాలను పకడ్బందీగా సేకరిస్తున్నారని తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్యూమరేషన్ కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేసి, ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శక ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఒవైసీకో న్యాయం.. ఇతరులకో న్యాయమా?

* కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్న



హైదరాబాద్: ఒవైసీకి చెందిన ఫాతిమా విద్యాసంస్థలపై హైకోర్టు ప్రశ్నలు సంధిస్తున్నా ప్రభుత్వం వివరణ ఇవ్వకుండా ఎందుకు జాప్యం చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. భాజపా అధికారంలోకి వస్తే ఫాతిమా విద్యాసంస్థలను కూల్చేస్తామని హెచ్చరించారు. ఆదివారం ఈ మేరకు సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ''అక్బరుద్దీన్ ఒవైసీ కాంగ్రెస్ అండతోనే హైకోర్టునే బెదిరించేలా హద్దులు మీరి మాట్లాడుతున్నారు. ప్రభుత్వం మౌనంగా ఎందుకు ఉంటోంది. గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న విద్యాసంస్థలను కూల్చేస్తామంటూ నోటీసుల మీద నోటీసులిస్తున్నారు. అక్బరుద్దీన్ ఒవైసీ ఆధ్వర్యంలోని ఫాతిమా విద్యా సంస్థల జోలికి సర్కారు ఎందుకు వెళ్లడం లేదు? ఒవైసీకి ఒక న్యాయం ఇతరులకు ఇంకో న్యాయమా? భాజపా అధికారంలోకి వస్తే అక్రమార్కులకు, అవినీతిపరులకు భయమంటే ఏమిటో చూపిస్తాం'' అని బండి సంజయ్ పేర్కొన్నారు.

## మజ్లిస్‌ను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో రేవంత్ సర్కారు

: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: హైడ్రా పేద ముస్లింల ఇళ్లు కూల్చివేస్తున్నప్పుడు కాంగ్రెస్, మజ్లిస్‌లు నోరెత్తలేదని ఇప్పుడు ఒవైసీ సోదరుల ఆస్తులను కాపాడే విషయంలో మాత్రం ఈ రెండు పార్టీలు ఒకే ఆలోచనతో వ్యవహరిస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ''హైడ్రా పేద ముస్లింల ఇళ్లను కూల్చింది. ఆ సమయంలో వారి తరఫున మజ్లిస్ గానీ, కాంగ్రెస్ గానీ ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అదే సమయంలో మజ్లిస్ పార్టీని కాపాడేందుకు ఎంత దూరమైనా వెళ్లేందుకు కాంగ్రెస్ వెనకాడటం లేదు. పక్షపాత పాలనకు హైడ్రా ఓ ఉదాహరణ. సామాన్యుల విషయంలో వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ, కఠినంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం... సల్కం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లో ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ విషయంలో మాత్రం ఎందుకు మౌనంగా ఉంటోంది? హైకోర్టు పలుమార్లు ప్రభుత్వ జాప్యంపై చీవాట్లు పెట్టినా సర్కారు తీరులో మార్పులేదు. ముస్లిం సమాజంపై కాంగ్రెస్ పార్టీకి ప్రేమలేదు. తమ మిత్రుడైన ఒవైసీకి ఇబ్బంది కలగకూడదన్నట్లుగా, మజ్లిస్ ప్రయోజనాలకు కాపాడేలా రేవంత్ సర్కారు వ్యవహరిస్తోంది'' అని కిషన్‌రెడ్డి అన్నారు.

## అయోధ్య రామ మందిరంలో కోట్ల రూపాయల అవినీతి

* బిజెపి చేసిన స్కాంపై భాజపా రాష్ట్ర నేతలు స్పందించాలి.
* రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : భారతదేశ ప్రజలు హిందువుల విశ్వాసం అయోధ్యలో రామ మందిరం కోసం ఎన్నో కోట్ల రూపాయల డొనేషన్లు ఇస్తే బిజెపి నాయకులు భారీ స్కాం కు పాల్పడ్డారని,రాముడి పేరు చెప్పుకొని ఓట్లు దండుకునే పార్టీ దేశంలో బిజెపి ఒక్కటేనని అలాంటి పార్టీ దేశ ప్రజలకు హిందువులకు ద్రోహం చేసిందని బిజెపి నాయకుల పై రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హుస్నాబాద్ మండలం జిల్లాల గడ్డ గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.అయోధ్యలో జరిగిన భారీ అవినీతిపై బిజెపి నేతలు స్పందించాలని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని దేవుని పేరుమీద అక్షింతల పేరుమీద, రాజకీయాలు చేయవద్దని పెద్ద ఎత్తున డబ్బులు దొంగతనం చేసి బిజెపి నేతలు అవినీతికి పాల్పడ్డారని ఆయన ధ్వజం ఎత్తారు. తెలంగాణ బిజెపి నేతలు దీనిపై స్పందించాలని ఆయన అన్నారు హుండీలు కొల్లగొట్టి రాముని పేరు మీద దేశవ్యాప్తంగా వసూలు చేసి చందాలు వసూలు చేసి ఎత్తుకొని పోయిన ఘనత వాళ్ళకే దక్కుతుందని ఆయన అన్నారు. మేము శ్రీరాముడి కళ్యాణం లో పాల్గొంటామని మన రాష్ట్రంలో ఇల్లంతకుంట రామాయణంలో బ్రహ్మాండమైన కళ్యాణం జరిపిస్తామని నేను ఎంపీగా ఉన్నప్పుడు భోజనం వసతి కల్పించాలని ఇప్పటికి నడుస్తుందని మంత్రి గుర్తు చేశారు .రామాలయం పై బిజెపి పెద్దలు స్పందించాలని భక్తి పేరు మీద రాముని పేరు మీద రాజకీయాలు చేసేవారు మాట్లాడాలని ఇక్కడ జరిగిన దానిపై పొరపాటు దేశ ప్రజలకు క్షమాపణలు అడగాలి రామజన్మభూమి అయోధ్య ఆలయంలో సొమ్మును దొంగలించడంపై హిందువులు అందరికీ అవమానం జరిగిందని ఆయన అన్నారు. దేవుడు పేరు మీద జరిగిన స్కాం దేవుడు స్కామ్ కి వాడుకున్న పార్టీ బిజెపి అని మంత్రి అన్నారు.ఈ విలేకరుల సమావేశంలో హుస్నాబాద్ ప్రాంతం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



ప్రజాస్ఫూర్తి, చుంచుపల్లి : సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు సురేష్ కుమార్ మిత్రులు హైదరాబాద్ వాసులు ఉప్పలపాటి రాజేంద్ర ప్రసాద్, ఉమారాణి ఆర్థిక సహకారంతో విద్యానగర్ కాలనీ లో ఉన్నటువంటి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 35 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్ ఎరేజర్లు, షార్పనర్లు, పలకలు అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నీరుకొండ హన్మంతరావు ప్రేరణతో గత పది సంవత్సరాల నుండి విద్యానగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం అసోసియేషన్ ద్వారా దాతల ఆర్థిక సహకారంతో నోట్ బుక్స్ అందజేయడం జరుగుతుంది అని, అలాగే పాఠశాలకు అవసరం అయినటువంటి కిటికీలకు మెష్, బాత్ రూం డోర్స్, ఫ్యాన్ లు, నీటి సౌకర్యం కొరకు వాటర్ ట్యాంక్, చేతులు శుభ్రం కోసం పంపులు,విద్యార్థులు నడవటం కోసం సిమెంట్ ఫ్లోరింగ్ ఏర్పాటు చేయడం జరిగింది అని, ఇక ముందు కూడా విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పిస్తామని ఆయన అన్నారు . ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నజియా, నారసింహారావు, సంఘ ఉపాధ్యక్షులు సురేష్ కుమార్, సభ్యులు బత్తుల కృష్ణయ్య పాండురంగారావు, సాయిబాబా, రాజేంద్ర ప్రసాద్, ధర్మారావు, మోహన్ లాల్, కామేశ్వరరావు, ప్రేమ సాగర్, ప్రవీణ్ కుమార్, అంజనానందం, సీతారామ శాస్త్రి, అబ్దుల్ రషీద్, శివరామకృష్ణ, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు .

## బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల నిర్లక్ష్యంపై ఆగ్రహం



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 40వ వర్ధంతి సందర్భంగా మల్కాజిగిరి పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆయన విగ్రహాల వద్ద కనీస పూల అలంకరణ, పరిశుభ్రత చర్యలు కూడా చేపట్టకపోవడాన్ని నేరేడ్మెట్ అంబేద్కర్ భవన్ కమిటీ తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వ యంత్రాంగం, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా దళిత మహానేతను అవమానించినట్టేనని కమిటీ నాయకులు మండిపడ్డారు.ఈ నేపథ్యంలో నేరేడ్మెట్ అంబేద్కర్ భవన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. బాబు జగ్జీవన్‌రామ్ వంటి జాతీయ నాయకుడి వర్ధంతిని అధికారికంగా నిర్వహించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇలాంటి నిర్లక్ష్య ధోరణి దళిత సమాజ మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు.ఇకపై ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రతి జాతీయ నాయకుడి జయంతి, వర్ధంతి సందర్భంగా విగ్రహాల వద్ద పరిశుభ్రత, పూల అలంకరణ, అధికారిక నివాళి కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పగిడిపల్లి మీ పేరు పాల్గొన్నారు శ్రీనివాస్, గంగాధరి కృష్ణ, జంగిలి శివకుమార్, ఎలిమెల్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'సర్'ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలి

* కాంగ్రెస్ శ్రేణులకు భట్టి దిశానిర్దేశం



హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను క్షేత్రస్థాయిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఆదివారం ప్రజాభవన్‌లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో నిర్వహించిన కీలక సమావేశానికి హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌తో కలిసి డిప్యూటీ సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ''ఓటరు జాబితాలో అన్‌మ్యాపింగ్ పేర్లు, సాంకేతిక లోపాలు, ఇంటి పేర్ల మార్పులు, అక్షర దోషాలు లేకుండా బీఎల్‌ఏలతో కలిసి డివిజన్ స్థాయి నాయకులు నిరంతరం పర్యవేక్షించాలి. ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో ఉన్న సానుకూలతను ఓటు బ్యాంకుగా మార్చుకోవాలి'' అని భట్టి దిశానిర్దేశం చేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ మాట్లాడుతూ.. అన్‌మ్యాపింగ్‌లో ఉన్న పేర్లు 50 శాతానికి పైగా ఉండటం ఆందోళనకరమని, వీటిని బీఎల్‌ఏలతో కలిసి సరిచూసుకోవాలన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు నిరంతర ప్రోత్సాహం: హరీశ్‌రావు

* సిద్దిపేటలో రూ.72 లక్షల విలువైన ఎగ్‌కార్ట్‌ల పంపిణీ



సిద్దిపేట : చిరువ్యాపారుల జీవనోపాధికి నిరంతర ప్రోత్సాహం అందిస్తామని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ(నెక్) సహకారంతో 5మండలాల్లోని 91 మంది చిరువ్యాపారులకు రూ.72 లక్షల విలువైన ఎగ్‌కార్ట్‌లను అందజేశారు. ఈ కార్ట్‌లో టీస్టాల్ స్టాండుతో పాటు సిలిండర్, స్టవ్, ఎల్ఈడీ దీపాలు, కోడి గుడ్ల ఆధారిత ఆహార పదార్థాల తయారీకి అవసరమైన సరంజామా ఉన్నాయి. హరీశ్‌రావు మాట్లాడుతూ కష్టపడి వ్యాపారం చేసుకునేవారికి ఎప్పుడూ సహకారం అందిస్తామని, నిజాయతీగా వ్యాపారం చేయడమే నిజమైన విజయమని పేర్కొన్నారు. చిరువ్యాపారులు ఆర్థిక అభ్యున్నతి సాధించాలని ఆకాంక్షించారు.ఎర్రబెల్లి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వినీత్‌రావు, నెక్ ప్రతినిధి వినయ్, పలు గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## నాడు ఇంజినీర్ల అవతారమెత్తి దోచుకున్నారు!

* కాళేశ్వరానికొచ్చే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదు: మంత్రి శ్రీధర్‌బాబు

భూపాలపల్లి : ''కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణాల సమయంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ఇంజినీర్ల అవతారం ఎత్తి రూ.కోట్ల ప్రజాధనాన్ని దోచుకుతిన్నారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో ఒక్క ఎకరానికి సాగునీరు అందించకుండా, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరిట రూ.1.25 లక్షల కోట్లను నీటిపాలు చేసిన మాజీ మంత్రి కేటీఆర్‌తోపాటు భారాస శ్రేణులకు ఈ ప్రాంతానికి వచ్చే నైతిక హక్కు లేదు'' అని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మండిపడ్డారు. భూపాలపల్లిలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ... ''ప్రాజెక్టుల నిర్మాణంతో వేల ఎకరాల పంట భూములతోపాటు ఇళ్లు మునిగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కన్నెపల్లికి వచ్చి మాట్లాడుతున్న కేటీఆర్ ముందు రైతులకు సమాధానం చెప్పాలి. కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లకు జాతీయ సాంకేతిక నిపుణులు, నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారుల నివేదిక ఆధారంగానే మరమ్మతులకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌లు కృషి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకురావడానికి మేం శ్రమిస్తుంటే.. ప్రమాదానికి గురైన బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయాలని కేటీఆర్ చెప్పడం సరికాదు. వాటిలో నీటిని నిల్వ చేస్తే అవి కూలిపోయి, కింది ప్రాంతాలకు తీవ్ర నష్టం జరుగుతుందని డ్యాం



సేఫ్టీ అధికారులు నివేదిక ఇచ్చారు' అని శ్రీధర్‌బాబు వెల్లడించారు.

# ఫస్ట్ టైమ్ లేడీ ఓరియెంటెడ్ మూవీలో..



ప్రేమలు బ్యూటీ మమితా బైజు ఫస్ట్ టైమ్ ఓ లేడీ ఓరియెంటెడ్ మూవీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆనేవాలా స్టార్ పేరుతో తెరకెక్కిన ఈ మూవీని సోమవారం అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. ఇందులో మమితా హీరోయిన్‌గా కనిపించబోతుంది. లేడీ ఓరియెంటెడ్ కథాంశంతో ఈ తమిళ మూవీ తెరకెక్కుతోన్నట్లు సమాచారం. అనౌన్స్‌మెంట్ వీడియోలో అశ్వత్ మారిముత్తుపై మమితా కత్తి విసిరుతూ స్టైలిష్ లుక్‌లో దర్శనమిచ్చింది. యాక్షన్ రోల్‌లో ఈ బ్యూటీ కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. అనామికా మహి, స్వాసిక కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఆరుగురు డైరెక్టర్లు కలిసి తెరకెక్కిస్తోన్న ఈ సినిమాను కోలీవుడ్ స్టార్ హీరో ప్రదీప్ రంగనాథన్ నిర్మిస్తున్నాడు. అల్ఫా యూనిట్ పేరుతో సినిమాను రూపొందిస్తున్నారు. సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్నాడు.



# ఓటీటీలోకి సింగ్ గీతం

నీవేదా పేతురాజ్ గెస్ట్ రోల్‌లో కనిపించిన సింగ్ గీతం మూవీ ఓటీటీలోకి వచ్చేస్తోంది. ఈనెల 9 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ఈ మూవీ స్ట్రీమింగ్ కాబోతుంది. ఈ అమ్మడు దాదాపు మూడేళ్ల తర్వాత ఈ సినిమాతోనే టాలీవుడ్‌లోకి రీఎంట్రీ ఇచ్చింది. 94 ఏళ్ల వయసులో టాలీవుడ్ సీనియర్ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన సింగ్ గీతం డిఫరెంట్ అంటెమ్ప్ట్‌గా తెలుగు ప్రేక్షకులను మెప్పించింది. కల్కి డైరెక్టర్ నాగ్ అశ్విన్ ఈ మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. అయాన్, అహల్య బమ్రూ, షాలిని కొండెపూడి కీలక పాత్రల్లో కనిపించారు. దేవిశ్రీప్రసాద్ మ్యూజిక్ అందించారు. కాగా థియేటర్లలో భారీ వసూళ్లను రాబట్టడంలో ఈ మూవీ విఫలమైంది. రూ. 22 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ మూవీ ఆరు కోట్లలోపే కలెక్షన్స్ దక్కించుకుంది. ఓటీటీ హక్కులు రూ.14 కోట్లకు అమ్ముడుపోవడం, శాటిలైట్, మ్యూజిక్ రైట్స్‌తో నిర్మాతలు లాభపడ్డారు.

సినిమా

# ఓటీటీ రిలీజ్.. రెండు రోజుల్లో బ్యాన్

దల్జీత్ దొసాంజా హీరోగా నటించిన సత్లుజ్ మూవీ పంజాబ్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఓటీటీలో రిలీజైన రెండు రోజులకే ఈ సినిమా స్ట్రీమింగ్‌ను నిలిపివేయడం వివాదాస్పదమైంది. తీవ్రవాద వ్యతిరేక చర్యల పేరుతో పంజాబ్ ప్రభుత్వం చేపట్టిన దహన కాండ ఆధారంగా ఈ మూవీని తెరకెక్కించారు. అయితే ఇందులో పంజాబ్, తార్న్ తారన్, ఘల్లుఘరా, జస్వంత్ సింగ్ ఖల్రా అనే పదాలు వాడొద్దని సీబీఎఫ్‌సీ సూచించింది. దాదాపు 127 కట్స్ చెప్పారు. కథ మొత్తం మారిపోవడంతో మేకర్స్ సీబీఎఫ్‌సీ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ఎట్టకేలకు టైటిల్‌తో పాటు కొన్ని మార్పులు చేసి ఓటీటీలో రిలీజ్ చేశారు. సోషల్ యాక్టివిస్ట్ జస్వంత్ సింగ్ ఖల్రా జీవితం ఆధారంగా దర్శకుడు హనీ టెహ్రాన్ ఈ మూవీని తెరకెక్కించారు. ఇందిరాగాంధీ హత్య తర్వాత ఆపరేషన్ బ్లూస్టార్ పేరుతో ప్రభుత్వం చేపట్టిన మిషన్‌ను అడ్డుపెట్టుకొని టెర్రరిస్ట్‌లు అనే ఆరోపణలతో చాలా మంది సామాన్య పౌరులను పంజాబ్ పోలీసులు హత్య చేసినట్లు ఖల్రా ఆధారాలతో సహా బయటపెట్టాడు. ఆ తర్వాత ఆయన హత్యకు గురయ్యాడు. ఈ కేసులో ఆరుగురు పంజాబ్ పోలీసులు దోషులుగా తేలారు.






# ఆ హీరో డామినేషన్ వల్లే దూరంగా ఉన్నా

ఓ బాలీవుడ్ యంగ్ హీరోపై కృతి సనన్ సంచలన కామెంట్లు చేసింది. మూడేళ్ల తర్వాత రియాక్ట్ అయింది. హీరో డామినేషన్ వల్లే తాను ప్రమోషన్స్‌కు దూరమవ్వాల్సి వచ్చింది. ఈ సినిమా రిజల్ట్‌ను కూడా తాను ముందే ఊహించా. ప్రమోషన్స్ బాధ్యతలు మొత్తం హీరోనే చూసుకున్నాడు. నేను ఈవెంట్లకు వెళ్లాలా? వద్దా? అన్నది అతడే డిసైడ్ చేసేవాడు. ఏం మాట్లాడాలో కూడా చెప్పేవారు. ఎక్కువ మాట్లాడొద్దు. నాకు చెప్పకుండా ఏం చేయద్దు అంటూ కండీషన్లు పెట్టారు. ఆ తీరు నచ్చకే ప్రమోషన్స్‌కు దూరంగా ఉన్నా. డైరెక్టర్ అడగడంతో చివరకు ఓ ఈవెంట్‌కు అటెండయ్యా. ఆ మూవీ హిట్ కాదని అప్పుడే అర్థమైంది అని కృతి సనన్ చెప్పుకొచ్చింది. అల వైకుంఠపురం మూవీ షెహ్‌జాదా పేరుతో హిందీలోకి రోహిత్ ధావన్ డైరెక్షన్‌లో రీమేక్ అయింది. ఇందులో కృతి, కార్తీక్ ఆర్యన్ జంటగా నటించారు. ఇప్పుడు కృతి చేసిన కామెంట్లు కార్తీక్ ఆర్యన్ గురించేనని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.



# నా వద్ద ఏనుగు దంతాలున్నాయ్

తన వద్ద ఏనుగు దంతాలు, వాటితో చేసిన విగ్రహాలు ఉన్నాయని ప్రముఖ నటుడు, మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ప్రకటించారు. మొత్తం 10 (5 జతలు) ఏనుగు దంతాలు, శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, తిరుపతి బాలాజీతో పాటు వివిధ దేవతలకు సంబంధించిన 13 దంతపు విగ్రహాలు ఉన్నాయని పేర్కొన్నారు. అవన్నీ వారసత్వంగా, బహుమతుల రూపంలో వచ్చాయని చెప్పారు. కేరళ అటవీ శాఖ అమలు చేస్తున్న అమ్నెస్టీ (క్షమా భిక్ష) పథకం కింద ఈ వివరాలను సమర్పించారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.